CHRI 2015

# పోలీసులను గురించి మీరు అడగాలనుకుంటున్న 101 ప్రశ్నలు కానీ అడగాలంటే భయం !!!




CHRI
Commonwealth Human Rights Initiative
working for the practical realisation of human rights in the countries of the Commonwealth

# మానవ హక్కుల కామన్‌వెల్త్ సంస్థ – CHRI

CHRI అనేది మానవ హక్కులకు సంబంధించిన స్వతంత్ర, నిష్పక్షపాత, అంతర్జాతీయ, ప్రభుత్వేతర సంస్థ. కామన్వెల్తు దేశాల్లో మానవహక్కులు ఆచరణాత్మకంగా అమలయ్యేలా చూడడం దీని బాధ్యత. కామన్వెల్తుకు సంబంధించిన పలు వృత్తిపరమైన సంఘాలు కలిసి 1987లో CHRI ని ఏర్పాటుచేసాయి. సభ్యదేశాలు ఒక నిర్దిష్ట పరిధిలో పనిచేసేవిధంగా వాటితో కలిసి కొన్ని విలువలు, న్యాయసూత్రాలను పంచుకున్నప్పటికీ మానవ హక్కులను మెరుగుపరచడానికి ఒక వేదిక సృష్టించినప్పటికీ, కామన్వెల్తు దేశాల్లో మానవ హక్కుల సమస్యలపై అంతగా శ్రద్ధచూపడం లేదని ఈ సంఘాలు భావించాయి.

కామన్వెల్తు సభ్యదేశాల్లో మానవ హక్కులపట్ల అవగాహన పెంపొందించడం, హరారే కామన్వెల్తు తీర్మానాలకు, విశ్వమానవ హక్కుల డిక్లరేషన్‌కు స్వదేశంతోపాటూ అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన మానవ హక్కుల అమలు యంత్రాంగానికి కట్టుబడి ఉండేలా చూడడం CHRI లక్ష్యాలు.

కామన్వెల్తు దేశాల్లో CHRI ఎప్పటికప్పుడు నివేదికలు, దర్యాప్తులద్వారా మానవ హక్కుల తాజా స్థితిగతులపట్ల, ఎదుర్కొంటున్న సమస్యలపట్ల అప్రమత్తం చేస్తుంటుంది. మానవ హక్కుల ఉల్లంఘనలను, దుర్వినియోగాన్ని ఆపడానికి తీసుకోవాల్సిన చర్యలను, అవలంబించాల్సిన దృక్పథాన్ని వివరిస్తూ, కామన్వెల్తు సచివాలయంతో, సభ్యదేశాల ప్రభుత్వాలతో, పౌర సంఘాలతో CHRI నేరుగా సంప్రదింపులు జరుపుతుంది. అవగాహనా కార్యక్రమాల ద్వారా, విధానపరమైన చర్చలద్వారా, తగిన దర్యాప్తుల ద్వారా దానికి ఉన్న నెట్ వర్కింగ్ ద్వారా ప్రాధాన్యతా అంశాలపై అనుసంధానకర్తగా వ్యవహరించడమే CHRI ఉద్దేశం.

CHRI తరఫున పనిచేసే సంస్థలు అంతర్జాతీయ నెట్‌వర్క్‌తో జాతీయస్థాయి ఉనికిని కలిగి ఉంటాయి. ఇవి వాటి రోజువారీ కార్యకలాపాల్లో మానవహక్కులను చేర్చడం ద్వారా వాటి సమాచారాన్ని, ప్రమాణాలను, ఆచరించాల్సిన విధులను ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్ళి ప్రభుత్వ విధాన నిర్ణయాల అమలుకు సారథ్యంవహించడానికి సిద్ధంగా ఉంటాయి. ఇవి స్థానిక సమాచారాన్ని కూడా సేకరించి, విధాన నిర్ణేతలతో అనుసంధానమవుతూ మానవ హక్కుల అభివృద్ధికి తోడ్పడతాయి.

CHRI న్యూఢిల్లీలో ఉంది. దీని కార్యాలయాలు లండన్, బ్రిటన్, ఆక్రా( ACCRA), ఘనాలలో ఉన్నాయి.

**International Advisory Commission:** Yashpal Ghai - Chairperson. Members: Clare Doube, Alison Duxbury, Wajahat Habibullah, Vivek Maru, Edward Mortimer, Sam Okudzeto and Maja Daruwala

**Executive Committee (India):** Wajahat Habibullah – Chairperson. Members: B. K. Chandrashekar, Nitin Desai, Sanjoy Hazarika, Kamal Kumar, Poonam Muttreja, Ruma Pal, Jacob Punnoose, AP Shah and Maja Daruwala - Director.

**Executive Committee (Ghana):** Sam Okudzeto – Chairperson. Members: Akoto Ampaw, Clare Doube, Yashpal Ghai, Wajahat Habibullah, Kofi Quashigah, Juliette Tuakli and Maja Daruwala - Director.

**Executive Committee (UK):** Clare Doube – Chairperson. Members: Richard Bourne, Katherine O'Byrne, Meenakshi Dhar, Joanna Ewart-James, Frances Harrison, Sadakat Kadri, Neville Linton, Sashy Nathan, Rita Payne, Michael Stone.

* Commonwealth Journalists Association, Commonwealth Lawyers Association, Commonwealth Legal Education Association, Commonwealth Parliamentary Association, Commonwealth Press Union and Commonwealth Broadcasting Association.

ISBN: 81-88205-67-2

© Commonwealth Human Rights Initiative, 2015. Material from this report may be used, duly acknowledging the source.

**CHRI Headquarters, New Delhi**
55A, Third Floor
Siddharth Chambers
Kalu Sarai
New Delhi 110 016, INDIA
Tel: +91-11-4318-0200, 4318-0201
Fax: +91-11-4618-0217
info@humanrightsinitiative.org

**CHRI United Kingdom, London**
Institute of Commonwealth Studies
28, Russell Square
London WC1B 5DS
UK
Tel: +44-020-7-862-8857
Fax: +44-020-7-862-8820
chri@sas.ac.uk

**CHRI Africa, Accra**
House No.9, Samora Machel
Street Asylum Down
Opposite Beverly Hills Hotel
Near Trust Towers,Accra, Ghana
Tel: +00233-21-971170
Tel/Fax: +00233-21-971170
chriafr@africaonline.com.gh

www.humanrightsinitiative.org

# పోలీసులను గురించి మీరు అడగాలనుకుంటున్న 101 ప్రశ్నలు కానీ అడగాలంటే భయం !!!




నవాజ్ కొత్వాల్

మజా దారూవాలా

# ముందుమాట

ప్రతిరోజూ మనకు పోలీసులు ఎక్కడో ఒకచోట తారసపడుతూనే ఉంటారు. బాగా రద్దీగా ఉన్న కూడళ్లలో వాహనాలకు చేతులూపుతూనో, విఐపిలకు వెనకాముందూ నడుస్తూనో, అల్లరి గుంపులను చెదరగొడుతూనో, నేరస్థుల చేతులకు బేడీలు వేసి కోర్టుకు తీసికెడుతూనో, సాక్ష్యం చెబుతూనో, పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు తీసుకుంటూనో, క్షేత్రస్థాయిలో నేరస్థులను తీవ్రవాదులను వెంబడిస్తూనో....ఇలా ఎప్పుడూ హడావిడిగా డ్యూటీలు చేస్తూ కనిపిస్తూంటారు. ఇదిగాక పత్రికల్లో, టివి ఛానళ్ల వార్తలలోనో, లేదా వాళ్ళూ వీళ్లూ చెబుతుంటేనో....అలా కూడా వాళ్లనుగురించి వింటూనే ఉంటాం. మనలో ప్రతి ఒక్కరికీ పోలీసంటే ఒక అభిప్రాయ మయితే ఉంటుంది. బహుశా అది ఎక్కువ భాగం వారిని పొగిడేదయితే కాదు. నిజం చెప్పాలంటే ...మనలో చాలా మందికి వాళ్లను గురించి తెలిసింది చాలా చాలా తక్కువ.

పోలీసులంటే - మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను చెప్పుచేతల్లో ఉంచడానికి, వాళ్లను అణగద్రొక్కడం కోసం అధికారంలో ఉన్న ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసే యూనిఫారమ్ తొడుక్కున్న తొత్తులుకారు. అగ్నిమాపకదళం వారిలాగా లేదా మన ఆస్తిపాస్తులు చూసే రెవిన్యూ సిబ్బందిలాగానే మనలో ప్రతి ఒక్కరికీ చట్టప్రకారం భద్రత, రక్షణ కల్పించే 'తప్పనిసరి సేవ' చేసేవారు. ప్రభుత్వంలోని అధికారులు, ఉద్యోగులు లాగానే పౌరులు చెల్లించే సొమ్ముతో వారి సేవచేసే ప్రభుత్వోద్యోగులు.

మన విషయంలో పోలీసులకు బాధ్యతలున్నట్లుగానే, వారి విషయంలో కూడా మనకు కొన్ని బాధ్యతలున్నాయి. బాధ్యతాయుత పౌరులుగా వారికి భయపడుతూ ఉండడంతోనో, వారి పట్ల విముఖతతోనో లేదా అవసరం తన్నుకొచ్చినప్పుడు మాత్రమే వెళ్ళివారి తలుపుతట్టడం తోనో మనం సరిపుచ్చుకోకూడదు. న్యాయాన్ని, ధర్మాన్ని, చట్టాలను కాపాడుకోవడానికి ప్రజలు, పోలీసులు భుజంభుజం కలిపి పనిచేయాల్సి ఉంటుంది. అది చేయాలంటే వాళ్ల కర్తవ్యం, వాళ్ళు ఎదుర్కొంటున్న సవాళ్ళు, వాటికోసం ఏం చేస్తున్నారు..ఎలా చేస్తున్నారు, అసలు వాళ్ళ వ్యవస్థ స్వరూప స్వభావాలు ఏమిటి ? వాళ్ళ అధికారాలు, విధులకు ఉన్న పరిమితులేమిటి?... ఇవన్నీ తెలుసుకోవడం అవసరం. అలాగే మన సొంతానికి మనకున్న హక్కులేమిటి ? బాధ్యతలేమిటో కూడా తెలుసుకోవడం ముఖ్యం. దానివల్ల పోలీసులు కానీ, పౌరులు కానీ ఒక వంక చట్టాలను ఎడమచేత్తో తోసేస్తూ, మరొకవంక దర్జాగా తిరగడం సాధ్యపడదు. ధర్మపాలన అన్నా, ప్రజాస్వామ్య పాలన అన్నా అదేకదా!!!

మీ పోలీసులను గురించి మీరు సులభంగా తెలుసుకోవడానికి ఈ చిన్న పుస్తకం ఉపయోగ పడుతుంది. మీ చేతిలో ఉన్న ఈ సమాచారంతో ఈ సారి మీ కళ్ళెదుట ఎవరయినా పోలీసు తప్పుచేస్తూ కనబడితే నోటికి తాళం వేసుకుని కూర్చోకుండా గొంతు విప్పగలుగుతారు. ఒక విషయం మనకు తెలిసి ఉన్నప్పుడు మాత్రమే ధైర్యంగా మాట్లాడగలం. అలా అన్యాయంపై మాట్లాడగలిగినప్పుడే 'మార్పు' సాధ్యపడుతుంది. ప్రజలు వాళ్ల పోలీసులను గురించి, వాళ్ళ సొంత హక్కులను గురించి పూర్తిగా తెలుసుకుని మనకు నిజంగా అర్హత కలిగిన మరిన్ని మంచి పోలీసు సేవలను కోరుకోవాలన్న ఆశతోనే ఈ పుస్తకాన్ని మీ ముందుంచుతున్నాం.

నవాజ్ కొత్వాల్, మజా దారూవాలా

**ఆలోచన, రూపకల్పన, అమరిక - సెంథిల్ కుమార్ పరమశివం,**

**రేఖా చిత్రాలు - సురేశ్ కుమార్**

**తెలుగు అనువాదం - ములుగు రాజేశ్వర రావు**

**1. మనకు పోలీస్ వ్యవస్థ ఎందుకు ?**



పౌరులకు భద్రత, రక్షణ భావం కలిగించడానికి పోలీస్ వ్యవస్థ ఉంది. సమాజంలో శాంతి భద్రతలను వారు కాపాడతారు. నేరాలు జరగకుండా చూస్తారు, జరిగితే దర్యాప్తు చేస్తారు. చట్టాలనుకూడా అమలుపరిచే విధులు నిర్వరిస్తారు. ఎంతగా అంటే... పోలీసులతో సహా ప్రతి ఒక్కరూ ప్రతి అడుగూ చట్ట ప్రకారంవేసే విధంగా.

**2. పోలీసులు చేయాల్సిందేమిటి ?**

వాళ్ళకు చాలా విధులున్నాయి. నేరాలు జరగకుండా చూడాలి, నియంత్రించాలి. నేరాల ఆచూకీ కనిపెట్టాలి. జరిగినప్పుడు సక్రమంగా శోధించాలి, దర్యాప్తుజరపాలి. న్యాయస్థానాల ముందు గట్టిగా వాదించడానికి వీలుగా నిఖార్సయిన సాక్ష్యాలను ప్రాసిక్యూటర్(ప్రభుత్వం నియమించిన న్యాయవాది)ముందుంచి కేసు బలంగా ఉండేటట్లు చూడాలి. మొత్తం శాంతి భద్రతల నిర్వహణ బాధ్యతకూడా పోలీస్‌దే. దీనికోసం తాను విధులు నిర్వర్తించే సమాజంలోని ఆనుపానులను ముందుగా సేకరించాల్సి ఉంటుంది.



రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు

**3. పోలీస్ అధికారాలంటే ఏమిటి ?**

పోలీసులకు రకరకాల అధికారాలున్నాయి. ఇవన్నీ చట్టం అనుమతించినవే. చట్టం ఎలా చెబుతుందో వాటిని అలాగే ఉపయోగించుకోవాలి. వాళ్ళు అరెస్ట్ చేయవచ్చు. సోదాలు నిర్వహించవచ్చు. స్వాధీనం చేసుకోవచ్చు. నేరాలు దర్యాప్తు చేయవచ్చు. సాక్షులను ప్రశ్నించవచ్చు. అనుమానితుల నుంచి సమాచారాన్ని రాబట్టవచ్చు. అదుపు తప్పిన జన సమూహాలను చెదరగొట్టవచ్చు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడవచ్చు.... ఏది చేసినా కచ్చితంగా చట్టం ఏం చెప్పిందో తు.చ.తప్పకుండా అలాగే చేయాలి తప్ప మరో విధంగా చేయకూడదు. వారికి తోచిన విధంగా లేదా వారనుకున్న విధంగా చేయడం కుదరదు. అధికార దుర్వినియోగం, విధి నిర్వహణ లో నిర్లక్ష్యం-క్రమశిక్షణారాహిత్యంగా పౌరుల పట్ల తప్పిదంగా, నేరంగా పరిగణింప బడతాయి. దానికి సదరు పోలీస్ అధికారికి శిక్ష కూడా పడుతుంది.




**4. భారతదేశం అంతటా ఒకే పోలీసు దళం ఉంటుందా ?**

ఉండదు. ప్రతిరాష్ట్రంలో కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలో వాటి సొంత పోలీస్ దళాలు

ఉంటాయి. అంటే దేశంలో చాలా దళాలున్నట్లు. ఇదిగాక దేశంలో అక్కడక్కడా ఉంటూ కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలో పనిచేసే దళాలుకూడా ఉంటాయి. దేశ రాజధానీ నగరం ఢిల్లీ, చండీగఢ్, పాండిచ్చేరి, డామన్-దయ్యూ, లక్షద్వీప్, దాద్రా, నాగర్ హవేలీ, అండమాన్ నికోబార్ దీవులలోని దళాలు కూడా కేంద్ర ప్రభుత్వ దళాల కిందనే పరిగణింపబడతాయి.

**5. పారామిలటరీ దళాలంటే ?**

కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (CRPF), సరిహద్దు భద్రతా దళం (BSF), అస్సాం రైఫిల్స్, ఇండోటిబెటన్ సరిహద్దు పోలీస్ (ITBP), జాతీయ భద్రతా దళం(NSG) వంటి పారా మిలిటరీ దళాలు సాయుధ పోలీస్ వ్యవస్థలే. కొన్ని ప్రత్యేకమైన విధుల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వమే వీటిని ఏర్పాటు చేసింది. వీటి వ్యవస్థ నిర్మాణం అంతా సైనికదళాలతో పోలి ఉంటుంది, కాబట్టి వీటిని 'పారామిలిటరీ' అంటారు. తిరుగుబాట్లు, అణచివేత, ఉగ్రవాద కార్యకలాపాల నియంత్రణ, కొన్ని సార్లు పౌరుల ఆందోళనలను అదుపు చేయడానికి కూడా ఈ దళాలు స్థానిక పోలీసులకు సహకరిస్తుంటాయి.



**6. ఎవరయినా పోలీస్ అధికారికావచ్చా?**

కావచ్చు. ఎవరయినా పోలీస్ అధికారి కావచ్చు. అయితే ఆ ర్యాంకుకు అవసరమయిన ప్రమాణాలను, అర్హతలను పొందాల్సిఉంటుంది. ఉదాహరణకు కానిస్టేబుల్ ఉద్యోగం కావాలనుకుంటే కనీసం ఉన్నత పాఠశాల తుదితరగతి పరీక్ష ప్యాసయి ఉండాలి. సబ్ ఇనస్పెక్టర్ ఉద్యోగంలో చేరాలంటే మీరు గ్రాడ్యుయేటయి ఉండాలి.

**7. నేను పోలీస్ అధికారిని కావాలంటే ఏం చేయాలి ?**

పోలీస్ శాఖలో చేరాలంటే మూడు స్థాయిలద్వారా ప్రవేశం సాధ్యం. రాష్ట్ర స్థాయిలో మీరు కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి DSP (డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్) వరకు ఎదగవచ్చు లేదా సబ్ ఇనస్పెక్టర్‌గా చేరి SP (సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్)స్థాయివరకు ప్రమోషన్లు పొందవచ్చు. ఎస్పి అంటే జిల్లా మొత్తానికి అత్యున్నత స్థాయి పోలీస్ అధికారి.

**8. ఐ పి ఎస్ అంటే ఏమిటి ?**

ఇండియన్‌పోలీస్ సర్వీస్‌కు సంక్షిప్త రూపం IPS. అత్యున్నత అఖిల భారత స్థాయి ఉద్యోగాలలో మొదటి మూడింటిలో ఒకటి. మిగిలిన రెండు : ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్-IAS, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్-IFS. సాధారణ అభ్యర్థులనుంచి పోలీస్

అధికారులను ఎంపిక చేసి దేశవ్యాప్తంగా సేవలందించడానికి ఉన్నతోద్యోగాలలో నియమించి పంపుతారు.

**9. నేను ఐపిఎస్ లో చేరాలంటే ఎలా ?**

మొదట మీరు UPSC వారు నిర్వహించే సివిల్స్ ప్రాథమిక(ప్రిలిమినరీ) పరీక్ష రాయాలి. ఈ పరీక్ష ఎప్పుడు ఎక్కడ జరిగేదీ జాతీయ, స్థానిక దిన పత్రికల్లో ప్రకటిస్తుంటారు. దీనిలో ఉత్తీర్ణత సాధిస్తే తర్వాత జరిగే మెయిన్స్ పరీక్ష రాయడానికి అర్హత సాధించినట్లు. ఈ లిఖిత పూర్వక పరీక్షల్లో ఉత్తీర్ణులయితే ఇంటర్వ్యూ ఉంటుంది. దాంట్లో కూడా విజయం సాధిస్తే మీరు ఏ సర్వీస్‌లో చేరడానికి ఇష్టపడతారో మిమ్మల్నే అడుగుతారు. ఏసర్వీస్ అంటే IAS,IPS, IFS, IRS లలో మీ ప్రాధాన్యతలను తెలపాలని అడుగుతారు. అయితే ప్రతిభ ప్రాతిపదికగా కేటాయింపులు జరుగుతుంటాయి కాబట్టి మీకొచ్చే అత్యధిక స్థాయి మార్కులను బట్టి మీరు కోరుకున్న సర్వీస్ మీకు దొరికే అవకాశం ఉంటుంది.



**10. ఒక ఐపిఎస్ అధికారిగా నాకు ఎటువంటి శిక్షణ ఇస్తారు ?**

ఐపిఎస్‌కు ఎంపికయినవారికి ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి అడ్మినిస్ట్రేషన్ అకాడమీలో ఫౌండేషన్ శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. దీని తరువాత హైదరాబాద్ లోని జాతీయ పోలీస్ అకాడమీలో మౌలిక శిక్షణ తరగతులకు హాజరు కావలసిఉంటుంది. ఇవిగాక ఉద్యోగం చేసే సమయంలోకూడా మధ్యలో అప్పుడప్పుడూ పునశ్చరణ తరగతులు నిర్వహిస్తుంటారు.

**11. ఇతర ర్యాంకులవారికి పోలీస్‌శాఖలో ఎలాంటి శిక్షణ ఇస్తుంటారు ?**

శరీర దారుఢ్యాన్ని పెంచే ఔట్‌డోర్ శిక్షణ ఇస్తారు. దీనితోపాటూ ఆయుధాల ఉపయోగం, ప్రాథమిక చికిత్స, అల్లర్ల నియంత్రణ, ఆయుధాలు లేకుండా ఎలా తలపడాలివంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు. నేర సంబంధమయిన చట్టాలు, అనుసరించాల్సిన పద్ధతులు, దర్యాప్తు కిటుకులు, ఆందోళనకారుల నియంత్రణలతోపాటూ విధినిర్వహణలో తరచుగా ఎదురయ్యే అంశాల్లో ఎలా వ్యవహరించాలో తరగతిగది శిక్షణద్వారా నేర్పుతారు.

**12. దేశం మొత్తంమీద ఎన్ని పోలీస్ స్టేషన్లు ఉన్నాయి ?**

దేశంలో జనవరి, 2014 నాటికి 14,611 పోలీస్ స్టేషన్లున్నాయి. వీటిలో 518 మహిళా పోలీస్ స్టేషన్లు.

**13. మనకు సరిపడా పోలీస్ అధికారులున్నారా ?**

లేరు. ఐక్యరాజ్యసమితి ప్రమాణాల ప్రకారం ప్రతి లక్షమందికి 222 మంది పోలీసులు ఉండాలి. కానీ మన దేశంలో జనవరి, 2014 నాటికి ప్రతి లక్షజనాభాకు 136.4 మంది పోలీసులే ఉన్నారు. జనాభా, పోలీసు నిష్పత్తిలో ప్రపంచంలో మనది అత్యంత తక్కువ నిష్పత్తి ఉన్న దేశాల్లో ఒకటి. చాలా ఖాళీలున్నాయి. భర్తీ చేయడం లేదు. జనవరి, 2014 నాటికి దేశంలో 22,83,646 లక్షలమంది పోలీస్ సిబ్బంది ఉండడానికి ప్రభుత్వం అనుమతి ఉంది. కానీ వాస్తవానికి 17,22,786 లక్షలమందే ఉన్నారు. అంటే 24.56% కొరత ఉన్నట్లు.

అయితే ఈ గణాంకాలలో మనకు వాస్తవ పరిస్థితి సంపూర్ణంగా బోధపడదు. ఎందుకంటే చిన్నవాటికంటే పెద్దనగరాల్లో ఎక్కువ మంది పోలీసులుంటారు. కనుక, అదీగాక అత్యంత తక్కువ సంఖ్యలో ఉండే ప్రముఖులకు (VIP లకు) భద్రతకోసం చాలామంది అధికారులను నియమిస్తారు. పాలనాపరమైన విధులు, ట్రాఫిక్ విధులు చాలామంది పోలీసుల విలువైన కాలాన్ని హరించేస్తున్నాయి. దీని ఫలితం-నేరవిచారణ, నేరస్థుల ఆచూకీ కనుగొనడం, శాంతిభద్రతల నిర్వహణకు సంఖ్యాపరంగా పోలీసుల సంఖ్యలో పెద్ద లోటు కనిపిస్తుంది.

**14. పోలీస్ ఉద్యోగాల్లో స్త్రీలు కూడా ఉంటారా ?**

ఉంటారు. అయితే మొత్తం పోలీసుల్లో జనవరి, 2014 నాటికి కేవలం 6.11% మందే మహిళలు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడులో అధికసంఖ్యలో స్త్రీలు పోలీస్ విధులు నిర్వర్తిస్తున్నారు.




**15. మహిళా పోలీస్ అధికారులకు డ్యూటీలు వేరుగా ఉంటాయా ?**

ఉండవు. ఇప్పటివరకు ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం పోలీసుల్లో పురుషులు ఏ డ్యూటీలు చేస్తున్నారో మహిళలు కూడా అవే చేయాలి. అయితే వారిని మహిళా పోలీస్ స్టేషన్లలోనే (పూర్తిగా మహిళలే ఉండే) నియమిస్తున్నారు.

**16. పోలీస్ ఉద్యోగాల్లో ప్రత్యేకమైన రిజర్వేషన్లు, కోటాలవంటివి ఏవయినా ఉంటాయా ?**

ఉంటాయి. నియామకాల్లో ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక కోటాలు ఉన్నాయి. 2014 జనవరి నాటికి మొత్తం పోలీసుల్లో షెడ్యూల్డు కులాలవారు 10.44% మంది వరకు ఉన్నారు. షెడ్యూల్డు జాతులవారు 8.26%, ఇతర వెనుకబడిన తరగతులవారు 19.26% మంది ఉన్నారు. ఈ వర్గాల వారి నుంచి ఎంతమందిని నియమించుకోవాలన్న విషయంలో కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రాలకు వేటి నిబంధనలు వాటికున్నాయి. కొన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలీస్ విభాగంలో స్త్రీలకు, మైనారిటీలకు రిజర్వేషన్ ఉంది.


డిజిపి


**17. పోలీసుల్లో దళితులు, స్త్రీలు, ముస్లింలు, క్రిస్టియన్లు, గిరిజనులు, ఇతరులంటూ అలా కేటగిరీలు ఉండాల్సిన అవసరం ఏముంది ?**

పోలీసుల్లో అన్ని వర్గాలవారు, అన్ని తరగతులవారికి చెందిన స్త్రీలు, పురుషులు కలిసి ఉండడం చాలా ముఖ్యం. ప్రజల్లోని, సమాజంలోని వివిధమతాలు, కులాల వారి ప్రవర్తన, వారి సంస్కృతులు, వారి మనస్తత్వాలు అన్నీ బాగా తెలుసుకోవడానికి, దురభిమానాలు పోగొట్టడానికి వీలవుతుంది.


ఐజిపి

**18. ఫలానా వ్యక్తి 'పోలీస్ అధికారే' తప్ప వేరే శాఖకు చెందిన అధికారి కాదు – అని నేను ఎలా చెప్పగలుగుతాను ?**

పోలీస్ అధికారుల యూనిఫారమ్ భిన్నంగా ఉంటుంది...ఖాకీ దుస్తులు, టోపీ, బెల్టు, నిర్దిష్టంగా సదరు అధికారి ఏ దళానికి చెందినవాడు, ఏ ర్యాంక్‌కు చెందినవాడని తెలిపే భుజకీర్తులు(భుజాలకుండే బిళ్ళలు, పట్టీలు), ఛాతీ భాగంలో చొక్కాపై పేరుతెలిపే బిళ్ళ వీటినిబట్టి చెప్పవచ్చు.


డిప్యూటీ ఐజిపి

**19. పోలీసుల్లో ఉండే రకరకాల ర్యాంకులు ఏమిటి ?**

పోలీస్ ఉద్యోగాల్లో అన్నిటికంటే దిగువన ఉండేది కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగం. ఇక్కడినుండి పైకి వరుసగా హెడ్‌కానిస్టేబుల్(HC), అసిస్టెంట్ సబ్ ఇనస్పెక్టర్(ASI), సబ్ ఇనస్పెక్టర్(SI), ఇనస్పెక్టర్(IP), అసిస్టెంట్ లేదా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ASP/DySP), అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(AddL SP), సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(SP), సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(SSP), డిప్యూటీ ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(DIG), ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(IGP), అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ADG). చివరన అన్నింటికంటే పైన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(DGP).


ఎస్ ఎస్ పి

**20. బీట్ కానిస్టేబుల్ అంటే ఏమిటి ?**

బీట్ అంటే ఇంగ్లీష్‌లో 'కొట్టడం' అనే అర్థాన్ని అన్వయించుకొని, మిమ్మల్ని కొట్టే పోలీస్ అనుకోకండి. అకారణంగా ఏ పోలీస్ ఎవరిమీదా బలప్రయోగం చేయకూడదు. అయితే అరెస్ట్‌కు నిరాకరిస్తేనో, పారిపోయే ప్రయత్నం చేస్తేనో తప్ప అలా అనుమతించరు. మరి అలా

ఎందుకంటారంటే–తాను లేదా తనతో పాటూ మరొక అధికారితో కలిసి నిఘా ఉంచే నిర్దిష్ట ప్రదేశంలోనో, మార్గంలోనో అన్నీ సవ్యంగా, సక్రమంగా ఉన్నాయో లేదో చూసుకోవడానికి, అనుమానింపతగినవి ఏవీ లేవు కదా అని నిర్ధారించుకోవడానికి విధులు నిర్వర్తించే పోలీస్ అధికారిని బీట్ పోలీస్ అధికారి అంటారు. రాత్రిపూట, ఈ విధులు నిర్వర్తించేవారు ఒక్కోసారి గట్టిగా పిలవడం, లాఠీలతో శబ్దం చేయడం వంటివి చేస్తుంటారు. అవి తాను విధుల్లో ఉన్నానన్న సంకేతాలు పంపడానికే !

**21. పోలీస్ అధికారులందరూ అన్ని రకాల డ్యూటీలు చేస్తుంటారా ?**

చెయ్యరు. కానిస్టేబుల్‌తో మొదలుపెట్టి డిజిపి వరకు ప్రతి స్థాయిలో ఉండే పోలీస్ అధికారికి ప్రత్యేకంగా విధులు కేటాయించారు. ప్రతి రాష్ట్రంలో 'పోలీస్ మాన్యువల్' అని ఉంటుంది. దానిలో ఇవి విపులంగా ఉంటాయి. సీనియర్ చెయ్యాల్సిన డ్యూటీ జూనియర్ అధికారి చెయ్యలేడు. ఉదాహరణకు- ఎస్‌పి చెయ్యాల్సిన డ్యూటీ ఎస్‌ఐ చెయ్యలేడు. అయితే కిందిస్థాయి అధికారి చేసిన ఏ పనినయినా పైస్థాయి అధికారి ఎవరయినా చేయగలరు.

**22. ట్రాఫిక్ విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీస్, ట్రాఫిక్‌కు సంబంధంలేని నేరాల విషయంలో నన్ను అరెస్ట్ చేయగలడా ?**

చేయగలడు. ట్రాఫిక్ పోలీస్ కూడా పోలీస్ అధికారే కదా. ఆ సమయానికి ట్రాఫిక్ విధుల్లో ఉన్నాడంతే. మీరేదయినా నేరం చేస్తున్నట్లు కనిపిస్తే ఇతర పోలీస్ అధికారుల్లాగానే మిమ్మల్ని అరెస్ట్ చేయగలడు. ఇలా సాధారణ పౌరులుకూడా చేయవచ్చు.



**23. సిఐడి (CID) అంటే ఏమిటి ?**

CID అంటే క్రిమినల్ ఇన్విస్టిగేషన్ డిపార్ట్‌మెంట్. దీన్నే కొన్నిసార్లు స్పెషల్ బ్రాంచ్(SB) అని దర్యాప్తు చేసే బ్రాంచ్ అనికూడా అంటూంటారు. రాష్ట్ర పోలీస్‌కు చెందిన దర్యాప్తు విభాగం అది. దగా, మోసం, ముఠాకొట్లాటలు(గ్యాంగ్‌వార్స్), అంతర్ రాష్ట్ర సంబంధమైన సీరియస్ నేరాలు జరిగినప్పుడు ఈ విభాగం వారిని పిలిచి దర్యాప్తు చేయవలసిందిగా అడుగుతుంటారు.

**24. సిఐడి, పోలీస్ వేర్వేరా ?**

కాదు. పోలీస్ శాఖనుండే కొంతమందిని ఎంపిక చేసి సిఐడి విభాగానికి కేటాయిస్తారు.

**25. మొత్తం పోలీస్‌దళానికి అధిపతి ఎవరు ?**

ప్రతి రాష్ట్రంలో మొత్తం పోలీస్ విభాగానికి ఒక అధిపతి ఉంటారు. అయనే డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్. క్లుప్తంగా డిజిపి అంటారు. అత్యున్నత స్థాయి అధికారి. అయినా ఆయన తన విధులను ప్రభుత్వ అజమాయిషీలో నిర్వర్తిస్తారు. కేంద్రంలోకానీ, రాష్ట్రంలోకానీ హెూం శాఖకు అధిపతి అయిన హెూంమంత్రి ఆదేశాలకు కట్టుబడి విధులు నిర్వర్తిస్తారు.



**26. డిజిపి ఏ మంత్రి ఆదేశాలనయినా ఎందుకు పాటించాలి ?**

మనలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబ ధన, మాన, ప్రాణ రక్షణ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా సురక్షితంగా ఉన్నామన్న భావనను కలిగించే బాధ్యత ప్రతి ప్రభుత్వం మీద ఉంటుంది. ఈ బాధ్యతను ప్రభుత్వం పోలీస్ విభాగానికి అప్పగించింది. ఆ కారణంగా ఈ బాధ్యతలను తాము ఎలా నిర్వర్తిస్తున్నదీ ప్రభుత్వానికి చెప్పడం అవసరం. అలాగే ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వానికి మరో బాధ్యత కూడా ఉంది. పోలీసులు నిజాయితీగా, నిష్పాక్షికంగా, సమర్ధంగా విధులు నిర్వహిస్తున్నారా లేదా అది కూడా వారి ఇష్టానుసారంంగా కాకుండా చట్టానికి లోబడి నిర్వర్తిస్తున్నారో లేదో చూడాల్సిన బాధ్యతకూడా దానికుంటుంది.

**27. పోలీస్ విధులు నిర్వర్తించడానికి డబ్బు ఎవరిస్తారు ?**

ఈ విధులు నిర్వర్తించినందుకు ప్రజలే పన్ను చెల్లింపుదారుల రూపంలో నిధులిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నుండి, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ నుండి వేతనాలు చెల్లించినా, నిధులన్నీ చివర్న ఎక్కడినుండి వస్తున్నాయి, పన్ను చెల్లింపుదారులనుండే కదా !!!

**28. ఈ నిధులు పోలీసులకు ఎక్కడినుండి అందుతున్నాయి ?**

ప్రతి రాష్ట్రంలో ఒక బడ్జెట్ ఉంటుంది. ఆ బడ్జెట్‌లో ప్రత్యేకంగా పోలీస్ సర్వీస్‌లకు నిర్దిష్ట మొత్తాన్ని కేటాయిస్తారు. దానినుంచి వారికి నిధులందుతాయి.

**29. బడ్జెట్‌ను ఎవరామోదిస్తారు ? దీనిలో ఎక్కువ భాగం దేనికి ఖర్చుపెడతారు ?**

బడ్జెట్‌ను అంతిమంగా రాష్ట్ర శాసనసభ ఖరారు చేస్తుంది. కేంద్రపాలిత ప్రాంతాలకయితే పార్లమెంట్ ఆమోదిస్తుంది. డిజి(పాలనా విభాగం) బడ్జెట్ మొదటి చిత్తు ప్రతిని తయారు చేసి

డిజిపిఆమోదానికి పంపుతారు. అక్కడినుంచి అది హెూంశాఖకు వెడుతుంది. అక్కడినుండి ఆర్థికశాఖ అనుమతికూడా పొందిన తరువాత దానిని సాధారణ బడ్జెట్‌లో భాగంగా మంత్రిమండలి ఆమోదానికి నివేదించడం జరుగుతుంది. పోలీసులకు కేటాయించిన బడ్జెట్‌లో ఎక్కువభాగం వేతనాల కింద ఖర్చవుతుంది. మిగిలిన వాటిలో శిక్షణ, దర్యాప్తు, మౌలిక సదుపాయాలు, గృహనిర్మాణం వంటివి ఉంటాయి.

**30. పోలీస్ విభాగానికి కేటాయించిన నిధులు సరిగా సక్రమంగా ఖర్చవుతున్నదీ లేనిదీ ఎలా తెలుస్తుంది ?**

పోలీసుల జమాఖర్చులన్నీ సంవత్సరానికొకసారి కాంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తనిఖీ చేస్తారు. ఈ వివరాలను శాసనసభకు, పార్లమెంటుకు సమర్పిస్తారు. ఒకసారి తనిఖీ అయిపోయిన తర్వాత కొన్ని సార్లు హెూం/పోలీసు విభాగం వారి వెబ్‌సైట్‌లో పెడతారు లేదా పార్లమెంట్ గ్రంథాలయంలో ఉంచుతారు. వార్షిక పోలీస్ ఖర్చుల సమాచారాన్ని సమాచారా




హక్కుచట్టం కింద మీరు అడిగి తెలుసుకోవచ్చు. పన్ను చెల్లింపు దారుల డబ్బుతో అంటే మీ డబ్బుతో పోలీస్ సేవలు అందిస్తున్నందువల్ల, ఈ డబ్బు సక్రమంగా ఖర్చవుతున్నదీ లేనిదీ తెలుసుకోవడానికి మీరుకూడా ఆసక్తి కనబరచాలి.

**31. పోలీస్‌లకు సంబంధించిన చట్టాలేమిటి ?**

1861 నాటి పోలీస్ చట్టానికి అనుగుణంగానే చాలా రాష్ట్రాలలో పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని రాష్ట్రాలకు వాళ్ళ సొంత చట్టాలున్నా, పోలీస్ చట్టాలన్నీ తప్పనిసరిగా 1861 చట్టం నమూనానే అనుసరిస్తున్నాయి. ఈ మధ్యనే కొన్ని రాష్ట్రాలు తమ చట్టాలను సవరించుకున్నాయి. కొత్త పోలీస్ చట్టాలను చేసుకున్నాయి. నేర సంబంధమైన నేర శిక్షా స్మృతి (ఐపిసి), ఇంకా స్థానిక చట్టాలవంటి ఇతర చట్టాలున్నాయి. ఇవన్నీ కూడా పోలీసుల పనులను, విధి నిర్వహణను నిర్వచిస్తాయి, నియంత్రిస్తుంటాయి.

**32. పోలీస్ చట్టం ఏం చెబుతున్నది ?**

పోలీసులు ఏం చేయాలి, ఏం చేయకూడదు, పోలీస్ విభాగాన్ని ఎలా నిర్వహించాలి, అక్కడ ఏయే ర్యాంకులు ఉంటాయి, పోలీస్ దళాన్ని ఎవరు పర్యవేక్షించాలి, నియామకాలు ఎవరు జరపాలి, తప్పుచేసిన వ్యక్తి కి శిక్షలు, క్రమశిక్షణా చర్యలేమిటి ?...ఇలా వీటన్నింటిని గురించి ఈ చట్టం చెబుతుంది. ప్రజలు అనుసరించడానికి కొన్ని నిబంధనలను కూడా ఇది నిర్వచించింది.

**33. పోలీస్ చట్టంలో ప్రజలు చేసిన నేరాల ప్రస్తావన ఎందుకు ?**

ప్రతి ఒక్కరూ రోడ్లు, జన సంచారం ఉండే ప్రదేశాలన్నీ శుభ్రంగా, ప్రశాంతంగా, సురక్షితంగా, సవ్యంగా ఎటువంటి రోగాలకు ఆస్కారంలేని విధంగా ఉండేటట్లు చూడడానికి కొన్ని నేరాలను అందులో చేర్చారు.

ఉదాహరణకు గొడ్లను రోడ్లమీదినుంచి తోలుకెళ్ళే వాళ్లను, బహిరంగ ప్రదేశాల్లో వాటిని వధించే వాళ్లను, లేదా వాటి పట్ల క్రూరంగా ప్రవర్తించే వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేయవచ్చు. రహదార్లమీద రాకపోకలకు ఆటంకం కలిగించినా లేదా మలినం చేసినా, లైసెన్స్‌లేకుండా రహదార్లమీద అమ్మకానికి వస్తువులుంచినా, అసభ్యంగా ప్రవర్తించినా, తాగి(మద్యం)వచ్చినా, అల్లరిచేసినా,బావులవంటి వాటి చుట్టూ కంచె వేసి సురక్షితంగా ఉంచకుండా నిర్లక్ష్యంగా ప్రవర్తించినా...ఇటువంటి చర్యలకు పాల్పడేవారిని వెంటనే అరెస్టు చేయవచ్చు.



**34. (సమ)ధర్మపాలన లేదా (సమ)న్యాయపాలన అంటే ఏమిటి ?**

అంటే మనమందరం చిన్నా పెద్దా , ఉన్నవాడూ లేనివాడూ, ఆడామగా అన్నతేడా లేకుండా అందరూ చివరకు ప్రభుత్వం, పోలీసులవంటి ప్రభుత్వోద్యోగులు కూడా చట్టాన్ని పాటించవలసిందే, దేశ రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలను అనుసరిస్తూ జీవించవలసిందే అని అర్థం. చట్టానికి ఎవరూ అతీతులు కారు. అంటే పోలీసులు తీసుకున్న ప్రతిచర్యా కూడా చట్ట ప్రకారమే ఉండాలి. అలా కానప్పుడు చట్టం ముందు పోలీసులు దోషులుగా నిలబడి సంజాయిషీ ఇచ్చుకోవలసివస్తుందనికూడా అర్థం. అలాగే మనం చేసుకున్న చట్టాలుకూడా సముచితంగా, ధర్మబద్ధంగా, నిష్పాక్షికంగా అందరికీ వర్తించేవిధంగా ఉండాలని కూడా అర్థం.

**35. తప్పుచేస్తే పోలీస్ అధికారిని శిక్షించవచ్చా ?**

నిస్సందేహంగా. చట్టాన్ని ఉల్లంఘిస్తే, మిగిలిన సాధారణ ప్రజానీకానికిలాగే ఒక పోలీస్ అధికారిని శిక్షించవచ్చు. నిజానికి చట్టాన్ని కాపాడే బాధ్యతను తలమీదికి ఎత్తుకున్న వ్యక్తి అయినందువల్ల దాన్ని అతిక్రమిస్తే చాలా కఠినంగా శిక్షించాలి. తప్పుచేసిన ఒక పోలీస్ అధికారిని శిక్షించడానికి చాలా మార్గాలున్నాయి. అతను ఒక నేరం చేస్తే మిగిలిన వారిలాగే అతనినీ న్యాయస్థానం ముందు నిలబెట్టి విచారణ జరిపించవచ్చు. తన విధి నిర్వహణలో మొరటుగా, అనుచితంగా ప్రవర్తించినా, చేయాల్సిన పద్ధతిలో విధి నిర్వహించలేకపోయినా అతనిని పై అధికారులు హెచ్చరించి వదిలివేయవచ్చు లేదా వేతనంలో కోత విధించవచ్చు. ర్యాంకు తగ్గించవచ్చు. సస్పెండ్ చేయవచ్చు లేదా బదిలీ చేయవచ్చు.



**36. పోలీసులు చాలా ప్రమాదభరితమైన పనులు చేస్తుంటారు కదా ! వారికి బీమా లాంటి సౌకర్యాలుంటాయా ?**

ఉంటాయి. పోలీసులందరికీ బీమా సౌకర్యం ఉంది. పోలీస్ సిబ్బందికి మొత్తం గ్రూప్ ఇన్సూరెన్స్ వర్తించే విధంగా జీతం నుండి చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. విధి నిర్వహణలో మరణించినవారి కుటుంబాలకు పెద్దమొత్తంలో ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు. ప్రమాదభరిత వాతావరణంలోనే పోలీసులు పనిచేస్తుంటారు. చాలా మంది చనిపోతుంటారు లేదా గాయపడుతుంటారు. గత పదేళ్ళలో సగటున ఏడాదికి సుమారు వెయ్యిమంది పోలీసులు విధి నిర్వహణలో చనిపోయారు. వీరిలో ఎక్కువ మంది కానిస్టేబుళ్ళు.

**37. డబ్బు చెల్లించే పద్ధతిపై నా సొంత భద్రత కోసం నాకు పోలీసులను కేటాయిస్తారా ?**

కేటాయిస్తారు. కానీ మీ ప్రాణానికి చాలా పెద్దఎత్తున ప్రమాదం పొంచి ఉన్నప్పుడు, కొన్ని సందర్భాల్లో ప్రభుత్వమే మీకు ఆ భద్రతను కల్పిస్తుంది. మిగిలిన సందర్భాల్లో మీరే దానికయ్యే ఖర్చు భరించాల్సి ఉంటుంది. 1861నాటి పోలీస్ చట్టం ప్రకారం ఒక ప్రాంతానికి పంపిన పోలీసులకంటే అదనంగా పోలీసులు అవసరమనిపిస్తే అధికారులు కూడా అందుకు అంగీకరిస్తే పరిమితకాలం వరకు అదనపు ఏర్పాట్లకు మీరు చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు- ఒక పెళ్ళి లేదా కార్యక్రమం పెద్ద ఎత్తున చేస్తున్నారు. మీ ఖర్చుతో అదనపు పోలీసులను అక్కడికి పంపడానికి పోలీస్ విభాగం అంగీకరించవచ్చు. అయితే ఆ ప్రాంతం తరచూ నేరాలు జరిగే ప్రదేశం అయి ఉండి, జరుగుతున్న కార్యక్రమంకూడా సాధారణ ప్రజానీకానికి సంబంధించినదయితే అక్కడికి అవసరమయిన పోలీసులను, అదనపు బలగాలను పంపడం పోలీసుల విధి. అటువంటి సందర్భాల్లో డబ్బు చెల్లించే ప్రసక్తే ఉండదు.

పోలీసుల పనికి
ముగింపుండదు



**38. పోలీసులు రాత్రింబవళ్లు డ్యూటీలోనే ఉంటారా ?**

ఔను ఉంటారు. 1861 పోలీస్ చట్టం స్పష్టంగా చెబుతున్నదేమిటంటే – "పోలీస్ ఎప్పుడూ డ్యూటీలో ఉన్నట్లుగా భావించాలి" అని. అంటే దానర్థం-అతనికి విశ్రాంతి తీసుకోవడానికి కూడా అనుమతించరని కాదు. దానర్థం ఏమిటంటే-పోలీస్ ఎక్కడ ఉన్నా, యూనిఫారమ్‌లో ఉన్నా లేకపోయినా చట్టాన్ని కాపాడడానికి సర్వ సన్నద్ధంగా ఉండాలని. తన కళ్ళముందు నేరం జరుగుతున్నా, లేదా సాయం కోసం ఆదుకోమని ఎవరయినా అభ్యర్థించినా 'నేను ఇప్పుడు డ్యూటీలో లేను' అనకూడదు.

**39. తన సీనియర్ అధికారి గానీ, లేదా మంత్రి లేదా జిల్లా అధికారివంటి ఆదేశాలివ్వడానికి యోగ్యుడైన మరో అధికారి గానీ ఇచ్చిన ఏ ఆదేశానికయినా లేదా అన్ని ఆదేశాలకు ఒక పోలీస్ అధికారి కట్టుబడి ఉండాలా ?**

ఉండనక్కరలేదు. ఆ ఆదేశాలు చట్టబద్ధమైనవయినప్పుడు మాత్రమే ఒక పోలీస్ అధికారి వాటిని శిరసావహించాలి. ఒకవేళ ఏమయినా తప్పుచేస్తే అవి ఎవరి ఆదేశాల మేరకు చేసినా సదరు పోలీస్ అధికారి మాత్రమే దానికి బాధ్యతవహించాల్సి ఉంటుంది. తప్పుచేసి చట్టవ్యతిరేకమయిన చర్యకు పాల్పడినప్పుడు ఎవరో పై అధికారి చెబితే చేసానని వారి ప్రవర్తనను వారు సమర్థించుకోలేరు. ఆవిధమైన సమర్థన అతనికి రక్షణ కల్పించలేదు.

**40. ప్రభుత్వ రవాణా వాహనాల్లో పోలీసులు టిక్కెట్ కొనకుండా ఉచితంగా ప్రయాణించవచ్చా ?మార్కెట్లనుంచి డబ్బులు చెల్లించకుండా ఏవయినా సరుకులు పట్టుకెళ్ళవచ్చా?**

కొన్ని సందర్భాల్లో పోలీసులు డ్యూటీమీద వెళ్ళేటప్పుడు వారికి ప్యాసులు ఇవ్వడం జరుగుతుంది. వాటినుపయోగించి ప్రభుత్వ రవాణా వాహనాల్లో వారు ఉచితంగా ప్రయాణించవచ్చు. అంతే తప్ప మిగిలిన సమయాల్లో, సందర్భాల్లో ఏ పోలీస్‌కూడా వాటిలో



ఉచితంగా వెళ్ళకూడదు. అలాగే తాను ఒక పోలీస్ కాబట్టి మార్కెట్‌లలోని దుకాణాలనుండి సరుకులు ఉచితంగా తీసుకెళ్ళకూడదు. అందరు పౌరుల్లాగానే వాళ్ళు కూడా డబ్బు చెల్లించి సరుకులు తీసుకెళ్ళాలి.

**41. ఒక పోలీస్ అధికారి ఇచ్చిన ప్రతి ఆదేశాన్ని నేను పాటించాలా ?**

తప్పనిసరిగా పాటించాలి. ఆ అధికారి తన విధి నిర్వహణలో భాగంగా చట్టబద్ధమైన ఆదేశాలు ఇస్తే తప్పకుండా వినాలి. నిజానికి ప్రతి పోలీస్ అధికారికి విధినిర్వహణలో సాయపడడం మన బాధ్యత. మరీ ముఖ్యంగా ఒక పోలీస్ అధికారి ఘర్షణలు ఆపే ప్రయత్నం చేస్తున్నప్పుడు, ఏదయినా నేరం జరగకుండా ఆపే ప్రయత్నం చేస్తున్నప్పుడు , పోలీసుల నిర్బంధం నుండి ఎవరయినా నేరస్థులు తప్పించుకుని పోయే ప్రయత్నం చేస్తున్నప్పుడు పోలీసులకు సహకరించడం మనందరి కర్తవ్యం. అలాగే ఏదయినా నేరానికి సంబంధించి మీవద్ద ఏదయినా సమాచారం ఉన్నప్పుడు దానిని పోలీసులకు చేరవేయడం కూడా మీ బాధ్యత. నేరస్థులుగా ప్రకటింపబడినవారిని చేరదీయడంగానీ, ఆశ్రయం కల్పించడంగానీ చేయకుండా ఉండడం కూడామీ బాధ్యతే. ఒక కేసు విషయంలో మీకు తెలిసినవి, మీరు చూసినవి కోర్టులో సాక్ష్యంగా చెప్పడం కూడా మీ బాధ్యత అవుతుంది.

**42. తనతోపాటూ ఎక్కడికయినా రమ్మనమని ఒక పోలీస్ అధికారి అంటే నేను తప్పనిసరిగా వెళ్ళాల్సివస్తుందా ?**

వెళ్ళక్కర్లేదు. అయితే తాను విధి నిర్వహణలో భాగంగా చేయబోయే పనిని అంటే ఎవరినయినా అరెస్ట్ చేసే సమయంలో, ఆస్తులను స్వాధీనం చేసుకునే సమయంలో, నేరస్థలాన్ని పరిశీలించేటప్పుడు, అటువంటి సందర్భాల్లో మీరు తప్పనిసరిగా వెళ్ళాలి.



సాయపడాలి. పోలీస్‌భాషలో దీనిని 'పంచ' అంటారు. అంటే 'నేను ఆ క్షణంలో ఇది చూసాను' అని న్యాయస్థానం ముందు స్వతంత్రంగా తెలియచేయడం.

**43. ఒకవేళ ఒక పోలీస్ అధికారి ఎవరయినా నన్ను పోలీస్ స్టేషన్‌కు రమ్మంటే నేను వెళ్ళాల్సి ఉంటుందా ?**

వెళ్ళక్కరలేదు. పోలీసులకు వారి విధినిర్వహణలో సహకరించడం మంచిదే. అయితే అతను మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నప్పుడు తప్పితే ఇతరత్రా మీరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళాల్సిన అవసరం లేదు. మిమ్మల్ని ఏ విషయంలోనయినా ప్రశ్నించదలుచుకుంటే లేదా ఏదయినా నేరానికి సంబంధించి విచారణ జరపదలుచుకుంటే మాత్రం పోలీసులు లిఖితపూర్వకంగా సమన్లుపంపాలి. అది జరగనంతవరకు మిమ్మల్ని పోలీస్ స్టేషన్‌కు రమ్మనమని బలవంతపెట్టకూడదు. అదే స్త్రీల విషయంలో అయితే లేదా 15 ఏళ్ళలోపు పిల్లల ప్రమేయం ఉంటే పోలీసులు వారిని వారి ఇళ్ళవద్దే ప్రశ్నించవచ్చు.

**44. ఒక పోలీస్ అధికారి అడిగిన అన్ని ప్రశ్నలకూ నేను జవాబు చెప్పాలా ?**

చెప్పాలి. నిజాయితీగా, ముక్కుసూటిగా ప్రశ్నలకు జవాబు చెప్పడం ఎప్పటికయినా మంచిదే. నీకు తెలిసిన వాస్తవాలు ఏవయినా ఉంటే అవి పోలీసులకు తెలియచేయాలి. మీకేదయినా తెలియని విషయాన్ని తెలిసినట్టుగా లేదా అతను చెప్పాల్సిన మాటలు మీచేత చెప్పించి స్టేట్‌మెంట్ ఇవ్వమని అతను మిమ్మల్ని బలవంతం చేయకూడదు. ఇలా పోలీసులు ప్రశ్నించే సందర్భాల్లో మీతోపాటూ మీకు తెలిసిన వారిని ఒకరిని మీ పక్కన ఉంచుకోవడం సర్వదా శ్రేయస్కరం.



**45. నేను ఆపదలో ఉన్నప్పుడు నన్ను ఆదుకునే బాధ్యత ఒక పోలీస్ అధికారికి ఉంటుందా ?**

ఉంటుంది. 1985లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పోలీసుల ప్రవర్తనా నియమావళికి సంబంధించి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు, కేంద్ర పోలీస్ సంస్థల అధిపతులకు మార్గదర్శకాలు జారీ చేసింది. వీటి ప్రకారం సంపద, సామాజిక హోదాలతో నిమిత్తం లేకుండా పోలీసులు అందరికీ సాయపడాలి. పోలీసులు నిర్భయంగా, నిష్పాక్షికంగా అందరికీ రక్షణ కల్పించే సాధారణ బాధ్యతలను నిర్వర్తించడం-అంటే ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారిపట్ల సానుభూతితో వారి మంచిని కోరే సదుద్దేశంతో వారిని వ్యక్తిగతంగా ఆదుకోవడానికి, స్నేహపూర్వకంగా మెలగడానికి సంసిద్ధులై ఉండాలని ఈ మార్గదర్శకాల్లో వివరించారు.




**46. నా కుటుంబ సమస్యల్లో నాకు సాయపడవలసిందని నేను పోలీసులను అడగవచ్చా ?**

అది మీ సమస్యనుబట్టి ఉంటుంది. ఒక స్త్రీని లేదా పిల్లలను చితగ్గొట్టడం, అక్రమ వివాహ సంబంధాలు, ఆస్తిపాస్తులు తదితరాల్లో నియమోల్లంఘనవంటి కుటుంబ హింసకు సంబంధించిన నేరాలయితే పోలీసులు తప్పనిసరిగా మీకు సహాయపడాలి. అదేదో మీ సొంత కుటుంబవ్యవహారం అని తిరస్కరించలేరు. అయితే 18 ఏళ్ళు దాటిన పిల్లలు, చెప్పినమాట వినడం లేదనో, పెళ్ళిచేసుకోవడానికి ఇంట్లోంచి పారిపోయారనో లేదా అటువంటి ఫిర్యాదులతో వారివెంట పరుగెత్తి వారిని మీ ఇంటికి రప్పించాలని బలవంతం చేయడం పోలీసుల పనికాదు. అది పూర్తిగా మీ వ్యక్తిగతం, మీ కుటుంబగతం.

**47. ఒక పోలీస్ అధికారి సాయపడడం లేదు లేదా దరిదాపుల్లో పోలీసులెవరూ లేరు. అటువంటప్పుడు ఒక దొంగను కానీ తప్పుచేసిన వ్యక్తిని కానీ నేను పట్టుకోవచ్చా ? పట్టుకుని అక్కడికక్కడ శిక్షించవచ్చా ?**

శిక్షించవచ్చు. శిక్షించకూడదు. రెండూ జవాబులే. ఎలా అంటే దీన్ని " సిటిజన్స్ అరెస్ట్" అంటారు. అలా తప్పు చేసినవాడిని మీరు పట్టుకుని దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళి అప్పగించాలి. అంతవరకే. తప్పు చేసినివారిని మీరు కొట్టకూడదు. అలా కొడుతున్న గుంపులో దూరిమీరూ ఓ చెయ్యి వేయకూడదు.ప్రజలలో ఒకరిగా మిమ్మల్ని మీరు రక్షించుకునే హక్కు మీకుంది. ఆత్మరక్షణ, ప్రాణరక్షణ, స్వీయరక్షణ హక్కు అంటాం దీనిని. అయితే దీనిని సమయోచితంగా వాడాలి. ఏకపక్షంగా కొట్టడం, ఘోరంగా అవమానించడం చేయకూడదు. ఇటువంటి వాటిని ఒక పోలీస్ అధికారి అనుమతించినా , తాను కూడా వారితో కలిసి ఆ చర్యల్లో పాలు పంచుకున్న నేరారోపణలు లేదా క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవడానికి సిద్ధపడాల్సివుంటుంది.

**48. ఒక పోలీస్ అధికారి నాకు సాయపడకపోతే నేనేం చేయాల్సి ఉంటుంది ?**

ఒక పోలీస్ అధికారి ఉద్దేశపూర్వకంగా లేదా తెలిసీ తెలిసీ పట్టించుకోకపోయినా, నిర్లక్ష్యం చేసినా ఆ అధికారి జైలుశిక్షకు అర్హుడవుతాడు. ఆ అధికారి చేయూతనివ్వనప్పుడు, తత్ఫలితంగా మీకు హాని జరిగితే, మీరు అతని పైఅధికారిని కలిసి ఫిర్యాదు చేయవచ్చు. అటువంటప్పుడు విధులను నిర్లక్ష్యం చేసినందుకు అతనిని దోషిగా నిలబెట్టే అవకాశం ఉంటుంది.

**49. పోలీసులు ఏదనుకుంటే అది చేయవచ్చా ?**

వీల్లేదు. చట్టబద్ధంగా ఉన్నదే చేయగలరు. నిజానికి చాలా నిబంధనలలో చాలా కఠినమైన నియమాల చట్రంలో వారు పనిచేస్తుంటారు. వాటిలో కొన్ని వారి సొంత నిబంధనలు కాగా, మిగిలినవాటిలో నేరశిక్షా స్మృతిలో పేర్కొన్నవి, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు, మానవ హక్కుల సంఘాల మార్గదర్శకాలవంటివి ఉన్నాయి.

**50. ఒకవేళ పోలీస్ అధికారులు వాటిని పట్టించుకోకపోతే.... ?**

పరిస్థితి తీవ్రతనుబట్టి మీరు పై అధికారులను లేదా మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఇటువంటి సందర్భాల్లో ఎప్పుడూ ఫిర్యాదు లిఖితపూర్వకంగా సమర్పించిన తరువాత దాని తాలూకు రశీదు పొందడం సర్వదా శ్రేయస్కరం.

**51. నేనేమని ఫిర్యాదు చేయాలి ?**




ఒక ప్రభుత్వోద్యోగి అన్ని వేళలా కర్తవ్యనిష్ఠలో ఉండాలి. మరి అటువంటప్పుడు ఒక పోలీస్ అధికారి తప్పుచేస్తే మీరు ఫిర్యాదు చేయవచ్చు. అతనుతన విధులను నిర్లక్ష్యం చేయకూడదు. అలాగని ఆలస్యంకూడా చేయకూడదు.

**52. ఒకవేళ ఒక పోలీస్ అధికారి నాపట్ల మొరటుగా, అవమానకరంగా ప్రవర్తిస్తే.. ?**

ఒకవేళ అది విధుల నిర్లక్ష్యానికి, క్రమశిక్షణారాహిత్యానికి సంబంధించినదయితే మీరు పై అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అలాకాక, అంతకంటే తీవ్రమైన వ్యవహారమయి, నేర స్వభావంతో ఉన్నట్లయితే ఆయనకు వ్యతిరేకంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు లేదా నేరుగా స్థానిక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దగ్గరకెళ్ళి ఆయనకు ఫిర్యాదు సమర్పించవచ్చు.

**53. ఆ పోలీస్ స్టేషన్‌లో నేను ఫిర్యాదు చేస్తే, వారి అధికారికి వ్యతిరేకంగా వారు దరఖాస్తు తీసుకోవడానికి నిరాకరించవచ్చుకదా ?**

ఔను. తరచుగా జరిగేది అదే. అయితే మీ సమస్యకు అక్కడే ముగింపు అనుకోవద్దు. మొరటు లేదా అవమానకర ప్రవర్తన, విధుల నిర్లక్ష్యం, పోలీస్ అధికారాల దుర్వినియోగంవంటి మీ ఫిర్యాదును పోలీస్ విభాగం అధిపతిని కలిసి ఇవ్వవచ్చు. అది నేర సంబంధమయినదయితే దగ్గర్లోని మేజిస్ట్రేట్‌ను కలిసి ఇవ్వవచ్చు.

**54. కోర్టుకెక్కడం చాలా కష్టం కదా ? అక్కడ చాలా కాలం పట్టవచ్చుకదా ?**

ఈ సమస్యను పరిష్కరించే దిశలో భాగంగా కొన్ని రాష్ట్రాలు పోలీసులపై వచ్చే ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా విభాగాలు ఏర్పాటు చేసాయి. ఇవి కేవలం పోలీసులకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చే ఫిర్యాదులనే స్వీకరిస్తాయి. ఇది గాక జాతీయస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో చాలా సంఘాలు(కమిషన్లు) ఉన్నాయి. వాటిలో కొన్ని-జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర

మానవ హక్కుల కమిషన్, షెడ్యూల్డు కులాలు, జాతుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్ దాని రాష్ట్ర శాఖలు, బాలల కమిషన్‌లు ఉన్నాయి. అవినీతి ఫిర్యాదులయితే కేంద్ర దర్యాప్తు సంస్థ(CBI), సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, లోకాయుక్త, రాష్ట్ర విజిలెన్స్ విభాగాలున్నాయి. ఇవి మీ ఫిర్యాదును పరిశీలించి, దర్యాప్తు జరిపి, వాటికున్న అధికారాలనుపయోగించి తప్పుచేసిన పోలీస్ అధికారికి వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ దాఖలుచేయమని లేదా బాధితులకు నష్టపరిహారం చెల్లించమని ఆదేశించవచ్చు.

**55. ఒక నేరానికి సంబంధించి ఒకవేళ నేను పోలీసులకు సమాచారం ఇవ్వాలంటే ఏం చేయాలి ?**


ఒకవేళ అది దొంగతనం, ఇంటికి కన్నం వేయడం, ఆడవాళ్లను వేధించడం, దాడి చేయడం, పిల్లలపై అత్యాచారం చేయడం, మానభంగం, అపహరణ, ట్రాఫికింగ్, దొమ్మీ వంటి తీవ్ర నేరాలయితే స్థానిక పోలీస్ స్టేషన్ అధిపతిని తక్షణం కలిసి FIR దాఖలు చేయవచ్చు. వారు దానిని విధిగా లిఖిత పూర్వకంగా తీసుకోవాలి. దాని సకలు కూడా ఒకటి మీకివ్వాలి. మీరు మీ ఫిర్యాదులను మేజిస్ట్రేట్‌కయినా ఇవ్వవచ్చు. దాన్ని ఆయన నమోదు చేసుకుంటారు.

**56. FIR అంటే ఏమిటి ?**

ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(First Information Report) అనే దానికి సంక్షిప్తరూపం FIR అంటే ప్రాథమిక సమాచార నివేదిక. ఒక శిక్షార్హమైన నేరాన్ని గురించి తెలిసిన బాధితుడు లేదా బాధితురాలు , ఒక వ్యక్తి, ఒక సాక్షి FIR దాఖలు చేయవచ్చు. FIR లో మీరు ఏం చెప్పారన్న దాని ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభిస్తారు. ఇది కేసుగా రూపుదిద్దుకోవడానికి అవసరమయిన వాస్తవాలు సేకరిస్తారు.

**57. నేను FIR దాఖలు చేయడానికి మా ప్రాంతంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌కే వెళ్ళాలా ? లేక ఏ పోలీస్ స్టేషన్‌లోనయినా దాఖలు చేయవచ్చా ?**

ఏ పోలీస్ స్టేషన్‌లోనయినా FIR దాఖలు చేయవచ్చు. అయితే నేరం జరిగిన ప్రాంతంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అయితే మరీ మంచిది. కారణం-పోలీసులు వెంటనే రంగంలోకి దిగడానికి ఆస్కారముంటుంది. ఇతర ఏ పోలీస్ స్టేషన్‌లో దాఖలు చేసినా వారు తప్పనిసరిగా దాన్ని నమోదు చేసుకుని (ఎంట్రీ) సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పంపాలి.నేరం తమ పరిధిలో జరగలేదన్న సాకుచూపి మీ FIR దాఖలు చేయడాన్ని తిరస్కరించలేరు.






**58. ఏ ఫిర్యాదునయినా నమోదు చేసుకోకుండా పోలీసులు తిరస్కరించవచ్చా ?**

తిరస్కరించవచ్చు : తిరస్కరించకూడదు. రెండూ జవాబులే దీనికి. మన దేశంలో నేరాలను రెండు తరగతులుగా వర్గీకరించారు. 'శిక్షార్హమైనవి, శిక్షార్హం కానివి' అని. శిక్షార్హమైనవి అంటే...హత్య, మానభంగం, దొమ్మీ, దారిదోపిడీ..వంటి నేరాలు. ఈ నేరాల విషయంలో పోలీసులు తక్షణం నేరుగా అప్రమత్తమై FIR నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించాలి. శిక్షార్హంకాని నేరాలంటే...మోసం, దగా, దొంగసంతకాలు, ఒకటికిమించి పెళ్ళిళ్ళు చేసుకోవడం, ప్రజలు సంచరించే ప్రదేశాల్లో అల్లరి చేయడం వంటివి. ఇవి ఎటువంటి నేరాలంటే వీటిని మేజిస్ట్రేట్ అధికారికంగా నమోదు చేసుకుని దర్యాప్తు జరపాల్సిందిగా పోలీసులను ఆదేశించిన తరువాతే దర్యాప్తు మొదలవుతుంది. ఈ నేరాలను ఇలా విభజించడంలో ఆంతర్యం ఏమిటంటే – తక్షణం స్పందించాల్సిన అవసరం ఉన్న నేరాలను పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని. మిగిలినవి మేజిస్ట్రేట్ వద్దకు వెడతాయి. అంటే మీ ఫిర్యాదును పోలీసులు అధికారికంగా నమోదు చేయకపోయినా కనీసం మీరు చెప్పేది వారు వింటారు. ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేకుండానే డైరీలో ఉచితంగా నమోదు చేసుకుంటారు. వాళ్ళ సంతకంతో ఒక కాపీ మీకు ఇస్తారు. దాన్ని ఇచ్చి మిమ్మల్ని మేజిస్ట్రేట్ దగ్గరికి పంపుతారు.

**59. ఒకవేళ శిక్షార్హమైన నేరమే అయినా, దాన్ని స్టేషన్ హౌస్ అధికారి నమోదు చేసుకోకుండా తిరస్కరిస్తే అప్పుడు నేనేం చేయగలను ?**

మీ ఫిర్యాదును నేరుగా పైఅధికారి వద్దకు లేదా జిల్లా పోలీస్ విభాగం అధిపతివద్దకు లేదా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వద్దకు వెళ్ళి నమోదు చేయించవచ్చు. మీ ఫిర్యాదు అధికారికంగా నమోదయిందా లేదా దానిమీద చర్యలు తీసుకుంటున్నారా లేదా అనే విషయాలు ఖరారు కావాలంటే మీరే స్వయంగా వెళ్ళి ఫిర్యాదు ఇవ్వండి లేదా అక్నాలడ్జ్‌మెంట్ తో రిజిస్టర్ పోస్ట్‌లో పంపండి. ఏది చేసినా ఫిర్యాదు అందినట్లు, వారి వద్దే సురక్షితంగా ఉన్నట్లు రశీదు పొందండి. దాన్ని బట్టి మీ ఫిర్యాదును సంబంధిత అధికారి వాస్తవంగా తీసుకున్నారనే విషయం రూఢీగా తెలుస్తుంది. దీనివల్ల మీ ఫిర్యాదు సక్రమ స్థితికి చేరుకున్నా, దీన్ని నమోదు చేయించడంలో మీరు పడ్డ ఇబ్బందులన్నీ కూడా ఫిర్యాదు చేయవచ్చు. అలా చేస్తే సంబంధిత అధికారి మరొకసారి అలా నిర్లక్ష్యం చేసే అవకాశాలు తగ్గుతాయి.

**60. FIR లో ఏమేం ఉండాలి ?**

FIR అనేది మీకు తెలిసిన వాస్తవాల వివరాలు లేదా మరొకరిద్వారా మీరు తెలుసుకున్న సమాచారం. అయితే ఎప్పుడూ కూడా మీరు అసలు వాస్తవాలు తెలుసుకుని ఉంటే మంచిది. ఆ నేరాన్ని మీరే స్వయంగా చూసి ఉండాలన్న అవసరం ఏమీ లేదు. ఏదేమయినా మీరు మాత్రం కచ్చితమైన సమాచారమే ఇవ్వాలి. అసలుకంటే పెద్దదిగా (చిలవలుపలవలుగా) చేసో, ఊహించో, అనుమానించో వాస్తవాలను వక్రీకరించవద్దు. నేరం జరిగిన ప్రదేశం, తేదీ, సమయం ఇవ్వాలి. దానితో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరి పాత్రను జాగ్రత్తగా

వివరించండి-వాళ్ళెక్కడున్నారు ? ఏం చేస్తున్నారు ? క్రమపద్ధతిలో ఎవరు ఏమీ చేసిందీ, ఏ రకమైన దర్యాప్తయినా జరిగిందా లేక జరిగిన నష్టం వివరాలు ఇవ్వండి. ఉపయోగించిన రకరకాల ఆయుధాల వివరాలను ఇవ్వడం మరిచిపోవద్దు. ఈ పరిస్థితులను, ఈ వాస్తవ సమాచారాన్ని వీలయినంత త్వరగా నమోదు చేయించండి. ఒకవేళ ఫిర్యాదు నమోదు ఆలస్యమయితే, ఆలస్యానికిగల కారణాలను కూడా లిఖిత పూర్వకంగా తెలపండి.

**61. నేను చెప్పినవన్నీ పోలీసులు సరిగ్గానే రాసుకున్నారని నెనెలా నమ్మడం ?**

FIR అనేది మీ వైపునుండి మీరు తెలిపిన మీరిచ్చిన కథనమే అనేది గుర్తుంచుకోండి. అది పోలీసుల కథనమో మరొకటో కాదు. అక్కడ పోలీసులున్నది మీరు చెప్పినది చెప్పినట్లు పొల్లు పోకుండా ఒక్కముక్క తీసివేయకుండా యథాతథంగా రాసుకోవడానికే. ఇది మీకు పూర్తిగా రూఢికావడానికి-చట్టం నిజానికి ఏం నిర్దేశిస్తుందంటే -FIR రాయడం అయిపోయిన తర్వాత పోలీస్ అధికారి దానిని పూర్తిగా మీకు చదివి వినిపించి మీరు సమ్మతించిన తరువాతే మీ సంతకం తీసుకోవాలంటుంది. తర్వాత పోలీసులు తప్పనిసరిగా దాని నకలును మీకు ఉచితంగా ఇవ్వాలి. FIR ను దానికోసం ఉద్దేశించిన FIR రిజిస్టర్‌లో నమోదు చేయాలి. దీని ఒక నకలు ప్రతిని మేజిస్ట్రేట్‌కు, మరొక దానిని పైఅధికారికి పంపుతారు.

**62. మహిళలిచ్చే FIRలు నమోదు చేసుకోవడానికి ప్రత్యేక విధానాలేమయినా ఉన్నాయా ?**

ఉన్నాయి. మహిళలకు వ్యతిరేకంగా జరిగే నిర్దిష్టమైన కొన్ని నేరాల విషయంలో అలా ఉన్నాయి. మానభంగం, సామూహిక మానభంగం, వెంటపడడం, నగ్నంగా ఉన్నప్పుడు రహస్యంగా చూడడం, లైంగిక వేధింపులు, ఉద్దేశపూర్వకంగా అమర్యాదగా ప్రవర్తించడం, యాసిడ్ దాడివంటి నేరాల విషయంలో ఒక మహిళ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదుచేయడం FIR నమోదు చేయడం సులభసాధ్యం కాదని గుర్తించిన చట్టం ఆమె FIRను ఒక మహిళా పోలీస్ అధికారితో నమోదు చేయించాలని తెలిపింది. ఒకవేళ బాధితురాలు మానసిక లేదా శారీరక వైకల్యంతో ఉన్నప్పుడు ఆమె తన ఫిర్యాదును నమోదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు కూడా వెళ్ళాల్సిన పనిలేదు. పోలీసులే ఫిర్యాదు నమోదుకు ఆమె ఇంటికి లేదా ఆమె సూచించిన ప్రదేశానికి వెళ్ళాలి. ఆమె అవసరాలమేరకు పోలీసులు ఒక న్యాయవాదిని కానీ, ఎడ్యుకేటర్‌ను కానీ తప్పనిసరిగా నియమించాలి. ఆమె వాంగ్మూలాన్ని వీడియో ద్వారాకూడా నమోదు చేయాలి.

**63. అటువంటి FIR ను నమోదు చేయడానికి పోలీస్ అధికారి తిరస్కరిస్తే ఏమవుతుంది ?**

లైంగిక నేరానికి సంబంధించి ఒక మహిళ చేసిన ఫిర్యాదును ఒక అధికారి నమోదు చేయలేదని రుజువయిన పక్షంలో 6 నెలలనుంచి 2 ఏళ్ళ వరకు జైలు శిక్షతోపాటూ జరిమానా కూడా చెల్లించాల్సివస్తుంది.






**64. లైంగిక అత్యాచార బాధితులయిన పిల్లల మాటేమిటి? వారి విషయంలో కూడా అనుసరించాల్సిన నిర్దిష్ట నిబంధనలేమయినా ఉన్నాయా ?**

పూర్తిగా ఉన్నాయి. లైంగిక నేరాలనుంచి బాలల రక్షణ చట్టం, 2012 (POCSO) లో ఇవి వివరంగా ఉన్నాయి. ఫిర్యాదు చేయడం, సాక్ష్యాన్ని నమోదు చేయడం, దర్యాప్తు, నేరవిచారణకు సంబంధించి పిల్లలకు స్నేహపూరిత వాతావరణంలో ఉండే విధంగా రూపొందించినవన్నీ ఈ చట్టంలో పొందుపరిచారు. ఫిర్యాదుచేసిన వెంటనే బాలలకు సంబంధించిన పోలీస్ సేవా విభాగం లేదా స్థానిక పోలీసులు బాధితుడు లేదా బాధితురాలి ఇంటికి లేదా వారు సూచించిన ప్రదేశానికి వెళ్ళి వాంగ్మూలాన్ని నమోదు చేసుకోవాలి. సబ్ఇనస్పెక్టర్ అంతకంటే పైస్థాయి మహిళా పోలీస్ అధికారితోనే ఫిర్యాదును నమోదు చేయించాలి. ఆ సమయంలో సదరు అధికారి పోలీస్ యూనిఫారమ్‌లో ఉండకూడదు. ఆ రాత్రికి బాధితుడిని లేదా బాధితురాలిని ఎటువంటి పరిస్థితులలో కూడా పోలీస్ స్టేషన్‌లో ఏ కారణం వల్లకూడా ఉంచకూడదు. బాలబాధితులు అర్థం చేసుకోగలిగిన భాషలోనే వాంగ్మూలాన్ని నమోదు చేయాలి. వారి అవసరాలమేరకు అనువాదకుడి లేదా నిపుణుడి సహాయం తప్పనిసరిగా తీసుకోవాలి. సదరు బాధితులకు సంరక్షణ లేదా ఆరోగ్యపరమైన జాగ్రత్తలు అవసరమని బాలలకు సంబంధించిన పోలీస్ విభాగం వారు లేదా స్థానిక పోలీసులు భావిస్తే, వారిని వెంటనే పంపే ఏర్పాటు చేయాలి. అలా పంపే సందర్భాల్లో పంపడానికిగల కారణాలను లిఖితపూర్వకంగా తెలియచేయాలి.

ఒకవేళ ఆస్పత్రికి తీసుకువెడితే తల్లిదండ్రులనుకానీ, బాల బాధితులు ఇష్టపడే వారినిగానీ తీసుకెళ్ళి వాళ్ళ సమక్షంలోనే వైద్య పరీక్షలు చేయించాలి. ఒకవేళ బాధితురాలయితే మహిళా డాక్టర్ చేతనే వైద్య పరీక్ష జరిపించాలి.

**65. నా FIR ను నమోదు చేసిన తర్వాత ఏమవుతుంది ?**

FIR తో పోలీస్ దర్యాప్తు ఆరంభమవుతుంది. దీనిలో భాగంగా పోలీసులు బాధితులతో, సాక్షులతో మాట్లాడవచ్చు. మరణ వాంగ్మూలంతో సహా స్టేట్‌మెంట్లు తీసుకోవచ్చు, నేరస్థలాన్ని పరిశీలించవచ్చు. నేర సంబంధమైన వాటిని వేలిముద్రల పరీక్షలకు పంపవచ్చు. శవాలను పోస్ట్‌మార్టమ్‌కు పంపవచ్చు. చాలామందిని ప్రశ్నించవచ్చు. ..ప్రతి సందర్భంలో దొరికే సమాచారం దర్యాప్తు ను మరింత లోతుగా పరిశీలించడానికి దారితీస్తుంది. ఒకసారి దర్యాప్తు పూర్తయిన తరువాత అక్కడ ఇన్‌చార్జి అధికారి దానిని పూర్తిగా నమోదు చేయాలి. దీనిని ఛలాన్ లేదా చార్జిషీట్ అనికూడా అంటారు.

**66. చలాన్ లేదా చార్జిషీట్ అంటే ఏమిటి ?**

మొత్తం దర్యాప్తు పూర్తి అయిన తరువాత సదరు పర్యవేక్షక అధికారి, కేసులో ఆద్యంతం లభించిన వాస్తవాలను పరిశీలించి, నేర నిరూపణకు అవసరమయిన సాక్ష్యాలున్నదీ లేనిదీ నిర్ణయించి ఆమేరకు న్యాయస్థానానికి నివేదించడానికి, వ్యాజ్యం నడిపించడానికి వాటి తో చార్జిషీట్ తయారు చేస్తాడు. నేరానికి సంబంధించిన ఆధారాలేవీ దొరకనప్పుడు, నిందితులను న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టడం వృథా కాలయాపనవుతుంది. ఒకసారి చార్జిషీటు ప్రాసిక్యూషన్‌కు, తద్వారా కోర్టుకు చేరిన తర్వాత వాళ్ళు ఆ చార్జిషీటులో ఉన్న వాస్తవాలను స్వతంత్రంగా పరిశీలించి, దానిలో చెప్పిన వివరాల ఆధారంగా నేరం జరిగిందనడానికిగల అవకాశాలను గుర్తిస్తారు.

**67. పోలీసులు నా ఫిర్యాదుకు స్వస్తి పలకవచ్చా ? ఇక దర్యాప్తు చేయకుండా ఆపివేయవచ్చా?**

ఆపివేయవచ్చు. వాళ్ళు సొంతంగా దర్యాప్తు జరిపి, నేరారోపణలను బలపరిచే వాస్తవాలేమీ లేవనిపించినప్పుడు, లేదా నేరం జరిగింది కానీ నేరస్థులు ఎవరో తెలియనప్పుడు, వాళ్ళు మీ ఫిర్యాదుకు ముగింపు పలకవచ్చు. అయితే వారే నిర్ణయం తీసుకున్నా మీకు తెలియపరచాలి. అటువంటి సందర్భాల్లో మీ ఫిర్యాదుకు పోలీసులు స్వస్తి చెప్పడాన్ని వ్యతిరేకిస్తూ మీరు కోర్టుకెక్కవచ్చు.




వారసత్వ సంక్రమణం

**68. నా కేసులో పురోగతిని నాకు ఎప్పటికప్పుడు తెలియచేస్తుంటారా ?**

అలా తెలియచేయాలని చట్టంలో ఎక్కడా నిర్దిష్టంగా పేర్కొనలేదు. అయితే కేసు పురోగతి ని ఫిర్యాదుదారుకు తెలియచేయడం మంచి సంప్రదాయం. కానీ అది దర్యాప్తును నీరుకార్చకుండా చూడాలి.

**69. ఒకవేళ పోలీసులు దర్యాప్తు జరపడం లేదు, లేదా చాలా నెమ్మదిగా దర్యాప్తు చేస్తున్నారు లేదా దర్యాప్తుకు కీలకాలయిన వాటిని పరిశీలించడానికి నిరాకరిస్తున్నారు...అటువంటప్పుడు నేనేం చేయాలి ?**

చట్టంలో ఒక ముఖ్యమైన సూత్రమున్నది. 'పోలీస్ దర్యాప్తులో ఎవరూ తలదూర్చకూడదు' అని. అలా ఉందికదా అని పోలీసులు ముందుకెళ్లడానికి విముఖత చూపినా లేదా విపరీతమైన మందకొడిగా సాగదీసినా, ఉద్దేశపూర్వకంగా దర్యాప్తు కీలకాలను పట్టించుకోకపోయినా మీరు కచ్చితంగా అధికారులకు లేదా మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయవచ్చు. అప్పుడు వారు సదరు అధికారిని దర్యాప్తు చురుగ్గా జరపాలని ఆదేశించవచ్చు లేదా దర్యాప్తు రికార్డును పరిశీలనార్థం తెప్పించుకోవచ్చు.ఏది ఏమయినా మీరు ఏం చేసినా లిఖితపూర్వకంగా చేయడం, వాటి రశీదులు భద్రపరుచుకోవడం ముఖ్యం.

**70. ఒక పోలీస్ అధికారిని ఎక్కడికంటే అక్కడికి నేను రమ్మనవచ్చా ?**

రమ్మనవచ్చు. రమ్మనకూడదు. రెండూ జవాబులే ! పోలీసులు పని వత్తిడిలో ఉంటారు. అదీగాక వాళ్ళ సంఖ్యకూడా తక్కువగా ఉంటుంటుంది. అందువల్ల అర్థంపర్థంలేని ఫిర్యాదులు, అరాకొరా సమాచారంతో వారిని పిలవకూడదు. అయితే మీరు నిజంగా ప్రమాదంలో ఉన్నప్పుడు, ఏదయినా నేరం జరిగినప్పుడు లేదా జరుగుతున్నప్పుడు, దొమ్మీ జరిగే అవకాశాలున్నప్పుడు, కొంతమంది కొట్టుకుంటున్నప్పుడు, త్వరలో అక్కడి పరిస్థితి చేయిదాటవచ్చనిపించినప్పుడు లేదా వారికి చేరవేయవలసిన చాలా ముఖ్యమైన సమాచారం మీ వద్ద ఉన్నప్పుడు వారిని పిలవవచ్చు. అయితే వారి ఉద్యోగవిధులకు ఏ మాత్రం సంబంధంలేని వ్యవహారాల్లో మీరు పిలవకూడదు. కొన్నిసార్లు అక్కడ ఏమీలేకపోయినా, ఏమీ




జరగకపోయినా ఆటపట్టించడానికి కొందరు అలా పిలుస్తుంటారు. అటువంటి ఆకతాయి చేష్టలకు మిమ్మల్ని శిక్షించవచ్చు.

**71. నేను అడగకుండానే ఒక పోలీస్ అధికారి మా ఇంటికి వచ్చి మా ఇల్లు సోదా చేయవచ్చా ? వస్తువులు పట్టుకెళ్ళవచ్చా ?**

చాలా కొన్ని పరిమిత సందర్భాల్లో మాత్రం అలా చేయవచ్చు. ప్రశ్నించడానికి వాళ్ళు మీ ఇంటికి వస్తే. మీ ఆహ్వానంమేరకు మాత్రమే మీ ఇంట్లోకి ప్రవేశిస్తారు. అయితే ఒక వేళ మీ ఇంట్లో ఎవరయినా అనుమానితుడిని లేదా నేరస్థుడిని మీరు దాచి ఉంచి నట్లు లేదా మీవద్ద దొంగిలింపబడిన సొమ్ము ఉన్నప్పుడు లేదా అక్రమ ఆయుధం ఉందని నమ్మదగిన ఆధారాలున్నప్పుడు మేజిస్ట్రేట్ అనుమతించిన సెర్చ్‌వారంట్ తో మీ ఇంట్లోకి వారు రావచ్చు. అయితే ఒకవేళ అనుమానితుడు, నేరస్థుడు లేదా ఏదయినా వస్తువులు వెంటనే తమ అధీనంలోకి తీసుకోకపోతే చేయిజారిపోయే ప్రమాదముందని పించినప్పుడు వారంట్ లేకుండా కూడా మీ ఇంట్లోకి వారు ప్రవేశించవచ్చు.

**72. అంటే మీరు చెప్పినదాన్నిబట్టి చూస్తే పోలీసులు మీ ఇంట్లోదూరి ఏదయినా ఎత్తుకెళ్ళిపోవచ్చునేనా ?**




కాదు. వాస్తవంగా అత్యవసరపరిస్థితుల్లో మాత్రమే... ఉదాహరణకు అనుమానితుడు పారిపోవడానికి నిజంగా అవకాశాలున్నాయి లేదా సాక్ష్యాన్ని ధ్వంసం చేయవచ్చనిపించి నప్పుడు మాత్రమే పోలీసులు వారంట్ లేకుండా మీ ఇంట్లోకి ప్రవేశించగలరు. వారంట్ ఉన్నా లేకపోయినా దానికి కూడా ఓ పెద్ద పద్ధతిని అనుసరించాల్సిఉంది. కనీసంలో కనీసం స్థానికంగా ఉండే ఇద్దరు సాక్షులను తమ వెంట తీసుకెళ్ళాల్సి ఉంటుంది. యజమాని సమక్షంలోనే ఇంటిని సోదా చేయాల్సి ఉంటుంది. 'నువ్విక్కడ ఉండొద్దు' అని యజమానితో చెప్పకూడదు. ఇక వాళ్ళు తమతో ఏమేం తీసుకెళ్ళేదీ అంతా ఒక జాబితా సిద్ధంచేయాల్సి ఉంటుంది. దానిమీద పోలీసులు, సాక్షులు, యజమానికూడా సంతకం చేయాల్సిఉంటుంది. దాని నకలును యజమానికివ్వాలి. ఒకవేళ ఇంటిలో పరదా సంప్రదాయం పాటించే స్త్రీలు ఉన్నట్టయితే ఒక మహిళా అధికారి కూడా సోదా చేసే బృందంలో తప్పనిసరిగా ఉండాలి. సోదా పూర్తిగా సభ్యతకు కట్టుబడి చేయాల్సి ఉంటుంది.

**73. సెర్చ్ వారంట్ అంటే ఏమిటి ?**


ప్రజల ఇళ్ళు, కార్యాలయాలనేవి పూర్తిగా ఆంతరంగిక ప్రదేశాలు. వాటిలో సోదాలు చేయకూడదు. బలమైన కారణమేదీ లేకుండా ఏ అధికారి కూడా వాటిలోకి ప్రవేశించడం కుదరదు. అందుకే చట్టం ఏం చెబుతుందంటే-ప్రజలకున్న ఈ హక్కుకు భంగం కలిగించాల్సినంత అవసరం ఏమొచ్చిందో సోదా చేయదలుచుకున్న అధికారి సహేతుకంగా వివరించాల్సిఉంటుంది. సదరు ప్రదేశంలో నేరాన్ని ఛేదించడానికి పనికి వచ్చే కొందరు తలదాచుకుని ఉన్నారనో లేదా వస్తువులు, పత్రాలు ఉన్నాయనో నమ్ముతున్నట్లు పోలీసులు మేజిస్ట్రేట్‌కు వివరించాల్సి ఉంటుంది. పోలీసు అధికారి చేయబోతున్నది 'అమాంబాపతు దర్యాప్తు' కాదని మేజిస్ట్రేట్‌కు అనిపిస్తే, ఆయన ఆ అధికారికి సోదా అధికారాన్ని ఇస్తాడు. ఇది కూడా చాలా పరిమితులతో కూడిన సోదా . నిర్దిష్ట ప్రదేశంలోకి వెళ్ళడానికి ఫలానా అధికారి పేరు, హోదా పేర్కొంటూ ఇచ్చే ఆ అనుమతి పత్రాన్ని మేజిస్ట్రేట్ సంతకం, కోర్టు సీలుతో జారీ చేస్తారు. అప్పుడది 'సెర్చ్ వారంట్' అవుతుంది.

**74. నేను వీథిలో నడుచుకుంటూ పోతున్నాను. ఎవరయినా ఒక పోలీస్ అధికారి నన్ను అడ్డగించి ఆయనకు తోచిన ప్రశ్నలు ఏవయినా అడగవచ్చా ?**

అలా కుదరదు. జనం వాళ్ళ మానాన వాళ్ళు వారి వారి చట్టబద్ధమైన వ్యాపకాలతో వారు పోతూ ఉంటే మామూలుగా పోలీసులు వారిని అడ్డగించకూడదు. కానీ ఎవరయినా ఒక ప్రదేశంలో మరీ ముఖ్యంగా చీకటిపడిన తరువాత అదే పనిగా తచ్చాడుతూంటే వారిని ఆపవచ్చు. 'నీపేరేమిటి ? ఏం చేస్తున్నావిక్కడ ?' అని అడగవచ్చు. వారి స్పందనలో ఏదయినా తేడా కనిపించినా, గోల్‌మాల్ వ్యవహారంలా అనిపించినా మిమ్మల్ని పోలీసులు అరెస్ట్ చేయవచ్చు. అనుమానితులు లేదా అలవాటుగా నేరాలు చేసేవారిని అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు తరచుగా ఈ అధికారాలను ఉపయోగిస్తుంటారు. అయితే అధికార దుర్వినియోగాన్ని సంస్కరణల కమిటీలు తరచుగా చర్చించాయి, ఖండించాయి కూడా.

**75. నేను ఒక ఊరేగింపులో కలవకుండా, వీథి సమావేశానికి హాజరవకుండా పోలీసులు నన్ను ఆపవచ్చా ?**

ఆపకూడదు. శాంతియుతంగా జరుగుతున్న ఊరేగింపులో చేరకుండా మిమ్మల్ని ఎవరూ ఆపలేరు. అయితే ప్రతి ఊరేగింపుకూ ముందుగా స్థానిక పోలీసులనుండి అనుమతి పొందడం మంచిది, తప్పనిసరికూడా. ఈ ఊరేగింపు అదుపుతప్పే అవకాశముందనీ, హింసాత్మకంగా మారవచ్చునీ వారి కనిపిస్తే, ముందే వారు దానికి అనుమతిని నిరాకరిస్తారు. ఒకవేళ తరువాత అదుపు తప్పితే పోలీసులు దానిని అడ్డగించవచ్చు. అక్కడ చేరినవారిని వెళ్ళిపోవాల్సిందిగా




కోరవచ్చు. వినకపోతే వారిని చెదరగొట్టడానికి చర్యలు తీసుకోవచ్చు. ఒకవంక శాంతియుత వాతావరణానికి భంగం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత, మరోవంక శాంతియుతంగా బహిరంగ సమావేశాలు నిర్వహించుకునే ప్రజల ప్రాథమిక హక్కును గౌరవించాల్సిన బాధ్యత కూడా వారిమీద ఉంటుంది.

**76. ఒక వీధి సమావేశాన్ని లేదా ఊరేగింపును భగ్నం చేయడానికి పోలీసులు బలప్రయోగం చేయవచ్చా ?**

చేయవచ్చు. పోలీసులు ఏం చేసినా, ఎలా చేసినా సహేతుకంగా ఉండాలి. పోలీసులు ఉన్నది జనాలను శిక్షించడానికి కాదు కదా ! ప్రజలకు రక్షణ కల్పించడానికి, శాంతిభద్రతలకి భంగం వాటిల్లకుండా చూడడానికే కదా వారక్కడ ఉండేది ! అందుకే నిబంధనలు ఏమి సూచిస్తాయంటే – గుంపులను అదుపు చేయడంలో బలప్రయోగాన్ని చివరి అస్త్రంగానే ఉపయోగించాలి. అప్పుడు కూడా కనీస స్థాయిలోనే, పరిస్థితికి తగినంత మోతాదులోనే చేయాలి. వీలయినంత త్వరగా దాన్ని ఆపేయాలి. నిజానికి ఇటువంటి పరిస్థితులలో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లేదా స్టేషన్ ఇన్‌చార్జి అధికారి లేదా సబ్ ఇనస్పెక్టర్ కంటే తక్కువ స్థాయి కాని అధికారి మాత్రమే బల ప్రయోగానికి ఆదేశించవచ్చు.

**77. పోలీసులు ఇష్టం వచ్చినట్లు కాల్పులు జరపవచ్చా ?**

జరపకూడదు. అదుపు చేయడానికి అన్ని పద్ధతులువాడి విఫలమైన తర్వాత బాగా అరుదయిన సమయాల్లో మాత్రమే ప్రాణాంతకమైన ఈ బల ప్రయోగాన్ని జరపాలన్నారు. అప్పుడు కూడా మేజిస్ట్రేట్ లేదా ఇన్‌చార్జి అధికారి మాత్రమే ఇటువంటి చర్యకు అనుమతించగలరు.



**78. ఒక గుంపు ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తూ, రాళ్లు విసురుతూ, ఆస్తులకు నష్టం కలిగిస్తున్నప్పుడు పోలీసులు ఏం చేస్తారు ?**

ప్రాణాలకూ, ఆస్తులకూ రక్షణ కల్పించడం పోలీస్‌లబాధ్యతే అయినా ఆ క్రమంలో తీసుకునే చర్యలకు కూడా ఒక పద్ధతి ఉంది. గుంపులో ఎక్కడివాళ్ళు అక్కడినుంచి వెళ్లిపోవాలని చెబుతూ పలుమార్లు హెచ్చరికలు ఇవ్వాలి. అదీ వెళ్ళడానికి వీలయిన వ్యవధి ఇస్తూ. అప్పటికీ వినకపోతే మరో హెచ్చరిక చేసి బాష్పవాయు గోళాలు లేదా  లాఠీ చార్జీకి పూనుకోవాలి. తల, భుజాల మీద లాఠీలతో దెబ్బలు కురిపించ కూడదు. నడుముకింద భాగాన్నే లక్ష్యంగా పెట్టుకోవాలి. ఒకవేళ కాల్పులకు దిగాల్సివస్తే, వాటి ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో చెబుతూ స్పష్టంగా హెచ్చరించాలి. ఇక్కడ కూడా బల ప్రయోగం కనీస స్థాయిలోనే ఉండేటట్లు చూసుకోవాలి. అందువల్ల కాల్పులుకూడా దిగువభాగాన్ని, గుంపులో ప్రమాదకరమైన భాగాన్ని లక్ష్యం చేసుకుని సాగించాలి. దీని ఉద్దేశం గుంపును కేవలం చెదరగొట్టడానికే తప్ప మరణాల సంఖ్య పెంచడానికి కాదు. గుంపు వెనకడుగువేసిన తరువాత కాల్పులు ఆపి గాయపడిన వారిని వెంటనే ఆస్రత్రికి తరలించాలి. అయితే ఆ సంఘటనలో పాల్గొన్న ప్రతి ఒక్క పోలీస్ అధికారి  రికార్డు కోసం వ్యక్తిగతంగా తన పాత్రను వివరిస్తూ నివేదిక ఇవ్వాలి.

**79. నన్ను పోలీసులు ఒక రహస్య ప్రదేశంలో ఉంచవచ్చా ? నన్ను అలా ఉంచినట్లు ఎవరికీ చెప్పకుండా ఉండవచ్చా  ?**

ఉంచకూడదు. ఇటువంటివి పోలీసులు తరచూ చేస్తుంటారని వింటూంటాం. కానీ అది చట్ట వ్యతిరేకం. ఎప్పుడయితే పోలీసులు మిమ్మల్ని అదుపులోకి తీసుకున్నారో భౌతికంగా మీ క్షేమం, మీ హక్కుల రక్షణ వారి బాధ్యతవుతుంది. మీకేదయినా హాని జరిగినా, మీ హక్కులకు ఏ విధంగానయినా భంగం కలిగినా పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇది అందరూ జాగ్రత్తగా గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన, న్యాయపరమైన అంశం.

ఇక స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరి వివరాలు వారి జనరల్ డైరీలో విధిగా నమోదుచేయాలి. ప్రశ్నించే నిమిత్తం మిమ్మల్ని  ఎప్పుడు తెచ్చారు, అరెస్ట్ ఎప్పుడు చేశారనే వివరాలన్నీ ఈ డైరీలో ఉంటాయి. ఈ సమాచారమంతా దర్యాప్తు అధికారి కేసు డైరీలో కూడా ఉంటుంది. గడిచిన 12 గంటల వ్యవధిలో ఎంతమందిని అరెస్ట్ చేసింది వారి జాబితాను ఎప్పటికప్పుడు తాజాగా పోలీస్ కంట్రోల్‌రూమ్ తప్పనిసరిగా బహిరంగపరచాలి.

చివరగా మరొక్క విషయం-మిమ్మల్ని ప్రశ్నించే సమయంలో మీ వకీలును మీ పక్కన ఉంచుకునే వెసులుబాటు ఉంది. అంటే - కనీసంలో కనీసం నిర్బంధించిన ప్రదేశం కచ్చితంగా తెలియపరచాలనేగా ! అలాగే స్నేహితులు, బంధువులు వచ్చిపోవడానికి వీలు కల్పించాలనేగా !

**80. పోలీస్ అధికారి నన్ను పోలీస్ స్టేషన్‌లో ఆపి ఉంచవచ్చా ? లేదా నాకు వెళ్ళాలనిపించినప్పుడు వెళ్ళిపోవచ్చా ?**


లాంఛనంగా మిమ్మల్ని అరెస్ట్ చేయనంతవరకు, మీ అభీష్టానికి వ్యతిరేకంగా మిమ్మల్ని నిర్బంధంలో ఉంచకూడదు. ప్రశ్నించే నిమిత్తం పోలీసులు మిమ్మల్ని పిలిపించినప్పుడు వారికి సహకరించడం, వారి దర్యాప్తులో సాయపడడం మీ విధి. అయితే ప్రశ్నలు వెంటవెంటనే ఉండాలి, సమర్ధంగా ఉండాలి.



అడిగినవే అడిగి సాగదీయకూడదు. స్టేషన్లో మిమ్మల్ని ఎంతసేపంటే అంత సేపు ముగింపన్నది లేకుండా నిరీక్షింప చేయలేరు. అటువంటి పరిస్థితులలో ఎప్పుడు వెళ్ళాలనిపిస్తే మీరు అప్పుడు వెళ్ళిపోవచ్చు.

**81. ఒకవేళ పోలీస్ అధికారి నన్ను వెళ్ళనీయకపోతే, నేనేం చేయగలను ?**

మిమ్మల్ని లాంఛనంగా అరెస్ట్ చేయనప్పుడు, మీ అభీష్టానికి వ్యతిరేకంగా మిమ్మల్ని ఒక్క క్షణం సేపు నిర్బంధించినా అతి తీవ్రమైన నేరంగా పరిగణింపబడుతుంది. దీనిని అక్రమ నిర్బంధం అంటారు. మీరుగానీ, మీ కుటుంబ సభ్యులుగానీ, స్నేహితులుగానీ సదరు అధికారిమీద పై అధికారికి లేదా మేజిస్ట్రేట్‌కయినా ఫిర్యాదు చేయవచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా మీరు వెంటనే హైకోర్టుకు లేదా సుప్రీంకోర్టుకయినా వెళ్ళి వకీలుద్వారా లేదా కుటుంబసభ్యుల ద్వారా లేదా స్నేహితుల ద్వారా 'మిమ్మల్ని వెంటనే విడుదల చేయాలని కోరుతూ' హెబియస్ కార్పస్ పిటీషన్ దాఖలు చేయవచ్చు.




**82. హెబియస్‌కార్పస్ అంటే ఏమిటి ?**

ఇది చాలా పాతపద్ధతి. బలవంతులైన పాలకుల మనుషులు ఇలా పౌరులను అప హరించుకు పోకుండా రక్షించడానికి ఉద్దేశించినది. ఈ పదాలకు అర్థం– 'శరీరాన్ని ప్రవేశపెట్టు' అని. అక్రమ నిర్బంధాలకు వ్యతిరేకంగా ఇది ఆచరణాత్మకమైన పరిష్కారం. న్యాయస్థానాలు హైకోర్టు కావచ్చు, సుప్రీంకోర్టు కావచ్చు, ఇటువంటి కేసులను చాలా అత్యవసర ప్రాతిపదికపై విచారణ జరుపుతాయి. ఒక వ్యక్తి కనిపించడం లేదు, ఆఖరి సారిగా పోలీస్ కస్టడీలో చూసామని తెలుపుతూ ఒకసారి దరఖాస్తు న్యాయస్థానానికి అందితే–సదరు వ్యక్తిని వెంటనే తమ ముందు హాజరుపరచాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశిస్తుంది. ఒకవేళ నిర్బంధానికి సరైన కారణాలు చూపలేకపోతే ఆ వ్యక్తిని విడుదలచేయాలని ఆదేశిస్తుంది. నిర్బంధం అక్రమమని తేలితే కోర్టు బాధితుడికి నష్ట పరిహారం కూడా ఇప్పించవచ్చు.

**83. "ఒక వ్యక్తిని అక్రమంగా నిర్బంధించారు. కానీ అతనిని ఎక్కడ ఉంచారో నాకు తెలియదు" ఈ పరిస్థితులలో అతని ఆచూకీ తెలుసుకోవడానికి మరో దారి ఏదయినా ఉందా?**

ఉంది. ఆ వ్యక్తి ఆచూకీ వివరాలు తెలపాల్సిందిగా కోరుతూ సమాచార హక్కు(RTI)చట్టం కింద సంబంధిత పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇవ్వవచ్చు. ఒక వ్యక్తి ప్రాణం, స్వేచ్ఛకు సంబంధించిన సమాచారం అయినందువల్ల పోలీసులు 48 గంటలలోపు సమాచారం ఇచ్చితీరాలి.

**84. సరైన కారణాలు లేకుండా ఒక పోలీస్ అధికారి నన్ను అరెస్ట్ చేయవచ్చా ?**

చేయకూడదు. అరెస్ట్‌కు సరైన కారణాలు ఉన్నప్పుడు పోలీసులు అరెస్ట్ చేయాలి. నేరం చేస్తున్న సమయంలో ఒక వ్యక్తిని 'రెడ్ హ్యాండెడ్'గా పట్టుకున్నారనుకుందాం. అరెస్ట్ చేయడానికి ఒక 'మంచి కారణం' ఉండాలి FIR లోని ఎవరి పేరునో మరెవరో చెప్పారనడం అరెస్ట్‌కు సరైన కారణం కాబోదు. మిమ్మల్ని అరెస్ట్ చేయాలంటే సాక్ష్యం రూపంలో మరికొన్ని ఆధారాలు కావాల్సి ఉంటుంది.

అలాగే ఒక వ్యక్తి నేరం చేశాడు. ఆ నేరం రుజువయితే ఏడేళ్ళ శిక్షపడుతుంది.అయినా పోలీస్ అధికారి అతనిని అరెస్ట్ చేయలేదు. అటువంటి మరిన్ని నేరాలు చేయకుండా నిరోధించడానికిగానీ లేదా సాక్ష్యాలను తారుమారు చేయకుండా చూడడానికికానీ సంతృప్తికరమైన కారణాలు కనిపించనంతవరకు పోలీస్ అధికారి ఆ వ్యక్తిని అరెస్ట్ చేయలేడు. ఏది ఏమయినా పోలీస్ అధికారి సదరు వ్యక్తిని అరెస్ట్ చేయడానికి గానీ, చేయకపోవడానికిగానీ లిఖితపూర్వకంగా కారణాలు తెలియచేయాల్సి ఉంటుంది.

**85. నేనేదయినా నేరం చేసినట్లు పోలీసులు అనుమానిస్తే, మా కుటుంబ సభ్యులను కూడా పోలీసులు అరెస్ట్ చేయవచ్చా ?**

చేయకూడదు. కలిసి ఉండడం వాళ్ళ నేరం కాదు. ఒక వ్యక్తి దోషా, నిర్దోషా అనే అంశాన్ని వాళ్ళ వ్యక్తిగత చర్యలను బట్టి నిర్ణయించాలి తప్పఅనుమానితులకు సన్నిహితంగా ఉన్నారన్న, బంధుత్వం ఉందన్న కారణంతో కాకూడదు. నిర్దిష్టమైన చట్టబద్ధమైన కారణాలతో తప్ప ఎవరి స్వేచ్ఛనూ హరించకూడదు.

సమాచారం రాబట్టే లేదా బేరసారాలాడే సాధనాలుగా కుటుంబసభ్యులను లేదా స్నేహితులను బెదిరించడం కానీ, నిర్బంధించడం కానీ చేయకూడదు. ఇలా బందీలుగా పట్టుకుపోవడం కనీసంలో కనీసంగా అక్రమ నిర్బంధం, అపహరణ లాంటి తీవ్రమైన నేరాలకు పాల్పడినట్లుగా పరిగణించాల్సి ఉంటుంది.

పోలీసులు దర్యాప్తు చేసే కేసులు ఎంత క్లిష్టమైనవయినా అనుమానితుడిచేత నేరాంగీకారం చేయించడానికి  లేదా ఒత్తిడితో లొంగదీసుకోవడానికి అక్రమ పద్ధతులకు పాల్పడకూడదు. కేవలం ఎవరిని అరెస్ట్ చేయవచ్చు అంటే -నేరం చేసారనడానికి సముచితమైన ఆధారాలున్నప్పుడు మాత్రమే అది సాధ్యం.



**86. స్త్రీలను అరెస్ట్ చేసే విషయంలో, వాళ్ళను నిర్బంధంలో ఉంచే విషయంలో ప్రత్యేక నిబంధనలేమయినా ఉన్నాయా ?**

చాలా ఉన్నాయి. ప్రత్యేకమైన కారణాలుంటే తప్ప స్త్రీలను సూర్యాస్తమయంతర్వాత-తిరిగి సూర్యోదయం లోపల మధ్య ఉండే వ్యవధిలో అరెస్ట్ చేయకూడదు. ఒకవేళ చేయదలిస్తే లిఖితపూర్వకంగా మేజిస్ట్రేట్ అనుమతి తప్పనిసరి. ఆవిధంగా అనుమతించడానికి చూపిన ప్రత్యేకమైన కారణాలతో మేజిస్ట్రేట్ సంతృప్తి చెందినట్లు భావిస్తేనే ఆయన అనుమతిం చాల్సి ఉంటుంది. ఒక మహిళా పోలీస్ అధికారి సమక్షంలోనే అరెస్ట్‌లు జరగాలి. పోలీస్ స్టేషన్‌లో కూడా స్త్రీలను ప్రత్యేక లాకప్‌లోనే ఉంచాలి. ఏ పరీక్ష చేయదలుచుకున్నా శారీరకంగా సోదా చేయదలుచుకున్నా ఒక మహిళా అధికారి లేదా డాక్టర్‌తో చేయించాలి. స్త్రీలకు సంబంధించిన అన్ని విధి విధానాలు చాలా జాగ్రత్తగా అనుసరించడం, రికార్డులన్నీ కచ్చితంగా ఉండేటట్లు చూడడం, పోలీస్ అధికారులకు సర్వ శ్రేయస్కరం. ఉదాహరణకు-నిర్బంధంలో ఉన్న స్త్రీ మానభంగం జరిగినట్లు ఫిర్యాదుచేస్తే సదరు ఆరోపణలు ఎదుర్కొన్న పోలీస్ అధికారి అటువంటిదేమీ జరగలేదని నిరూపిస్తే తప్ప ఆమె ఫిర్యాదును ఆమోదించాలని చట్టం చెబుతున్నది.

**87. పిల్లల సంగేతేమిటి ? వారి విషయంలో కూడా ప్రత్యేక నిబంధనలున్నాయా ?**



సాధారణ చట్టం ప్రకారం ఏడేళ్ళలోపు పిల్లలపై ఎటువంటి నేరారోపణ చేయకూడదు. అందువల్ల వారిని పోలీస్ కస్టడీలోనికి తీసుకునే ప్రశ్నే లేదు. అయితే 18 ఏళ్ళలోపు పిల్లలను ప్రశ్నించడానికి, నిర్బంధించడానికి, కస్టడీకి తీసుకోవడానికి, విడుదల చేయడానికి, బెయిలివ్వడానికి బాలన్యాయ(బాలల పట్ల శ్రద్ధ, సంరక్షణ) చట్టం, 2002 నిర్దేశించిన విధివిధానాలు పాటించాలి.

ప్రతి పోలీస్ స్టేషన్‌లోకూడా ప్రత్యేకంగా శిక్షణ పొందినవారితో బాల నేరస్థులను పర్యవేక్షించే పోలీస్ విభాగం ఉండాలి. బాలనేరస్థులను లాకప్‌లో ఉంచకూడదు. వారి పట్ల శ్రద్ధ, వారి సంక్షేమం, బాధ్యత ఈ విభాగానిది.వారిని స్టేషన్‌కు తీసుకువచ్చిన తరువాత అవసరం తీరిన వెంటనే వారిని బెయిల్‌పై విడుదల చేసి తల్లిదండ్రులకు వారి హామీల పూచీపై వారికి అప్పగించాలి. తల్లిదండ్రులు అందుబాటులో లేకపోతే లేదా అలా పంపడం చెడు సాహచర్యంలోకి దించినట్లవుతుందని భావిస్తే వారిని తిరిగి కోర్టులో హాజరు పరచేవరకు స్థానిక బాలల సంరక్షణ కేంద్రాలకు అప్పగించాలి.చట్టాలు–వాటిని ఉల్లంఘించిన బాలల పట్ల ఇంత శ్రద్ధ చూపడంలో ప్రధాన సూత్రం ఏమిటంటే–పిల్లలపట్ల స్నేహపూర్వక దృక్పథంతో మెలిగేటట్లు చేయడమే. అదికూడా పిల్లల పునరావాసంకోసం వారి ప్రయోజనాలను ఉత్తమంగా పరిరక్షించడం కోసం

**88. ఒకవేళ పోలీసులు నన్ను అరెస్ట్‌చేస్తే వారి ఇష్టమొచ్చినంతకాలం ఉంచుకోవచ్చా ?**

అస్సలు వీలుకాదు. పోలీస్ స్టేషన్‌లో ఎవరినయినా గరిష్టంగా 24గంటల వరకే ఉంచుకోవచ్చు. అంతకుమించి కుదరదు. ఎవరినయినా 24గంటలు దాటకముందే వారి అరెస్ట్‌ను సమర్థించే అన్ని పత్రాలతో సహా మేజిస్ట్రేట్ ముందు వారిని హాజరుపరచాలి. తర్వాత చెల్లదు.

**89. మరటువంటప్పుడు శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేసి వారిని తప్పనిసరిగా సోమవారం వరకు కస్టడీలో ఎలా ఉంచుతున్నారు ?**

ఇటువంటి అక్రమ పద్ధతులకు పోలీసులు ఇచ్చే సంజాయిషీ ఏమిటంటే–'వారాంతాల్లో మేజిస్ట్రేట్ ఉండరు' అని. కానీ వాస్తవానికి మేజిస్ట్రేట్ అన్నిరోజుల్లో అన్ని వేళల్లో విధుల్లో ఉంటాడు. ఒకవేళ కస్టడీలో ఉన్న వ్యక్తికి సంబంధించిన 24గంటల గడువు కోర్టు పనిదినాల/పనివేళల తర్వాత ముగిస్తే వారిని మేజిస్ట్రేట్ ఇంటిదగ్గర ఎప్పుడయినా హాజరుపరచవచ్చు. 'ఈ నిందితుడిని ఇప్పుడు చూడను' అని మేజిస్ట్రేట్ తిరస్కరించ కూడదు

**90. నేనెక్కడ ఉన్నదీ (పోలీసుల అదుపులో) ఎవరికయినా ఎలా తెలుస్తుంది ?**

వ్యవస్థలో మీరు కనుమరుగయిపోకుండా చూడడానికి చట్టం చాలా రక్షణలు కల్పించింది. పోలీసులు మిమ్మల్ని అరెస్ట్ చేసిన వెంటనే చాలా పనులు చక్కబెట్టాల్సి ఉంటుంది. మొదట 'మెమో ఆఫ్ అరెస్ట్' అనే దానిని తయారు చేసి స్థానిక మేజిస్ట్రేట్‌కు పంపాలి.మీరు సొంతంగా కానీ, న్యాయసేవా సంస్థలనుంచిగానీ ఒక వకీలును వెంటనే ఏర్పాటు చేసుకోవాలనే పద్ధతి మీకు తెలుసనే విషయం వారు రూఢి చేసుకోవాలి. మీరు ఎవరి పేరు చెబితే వారికి...కుటుంబ సభ్యులకు కానీ, స్నేహితులకు కానీ మీరెక్కడున్నదీ సమాచారం ఇవ్వాలి. పోలీసులు అధికారాన్ని దుర్వినియోగం చేసే అవకాశాలను తగ్గించడానికి ఇవన్నీ చట్టం బిగించిన చట్రాలు. ఒకవేళ పోలీసులు వాటిని అనుసరించకపోతే న్యాయస్థానాలకు వారే సంజాయిషీ



ఇచ్చుకోవాల్సి ఉంటుంది.

ఇవే గాక అరెస్టయిన వారందరి పేర్లు, చిరునామాల జాబితా అరెస్ట్ చేసిన అధికారుల పేర్లు సంతకాలతో తయారుచేసి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌ల బయట ప్రదర్శించాలి. అన్ని రాష్ట్రాలలోని పోలీస్ ప్రధాన కార్యాలయాలలో సాధారణ ప్రజానీకం చూసు కోవడానికి వీలుగా అరెస్టయిన వ్యక్తుల ఈ జాబితాలన్నీ అందుబాటులో ఉంచాలి.

**91. 'మెమో ఆఫ్ అరెస్ట్' వల్ల నాకేం ఉపయోగం ?**

అక్రమ నిర్బంధం జరగకుండా ఇది రక్షణ కల్పిస్తుంది. దీనిలో మీ పేరు, అరెస్ట్ చేసినప్రదేశం, సమయం, తేదీ, అరెస్ట్ కు కారణాలు, ఆరోపించబడిన నేరం వివరాలను పేర్కొంటారు. దానిమీద పోలీసులు, ఇద్దరు సాక్షులు, మీరు సంతకం చేయాల్సి ఉంటుంది. వాస్తవాలను వాస్తవంగా నమోదు చేసారన్న విషయం ఖరారు చేసుకోవడానికే ఈ ఏర్పాటు. దీనిని మేజిస్ట్రేట్‌కు ఇస్తారు. మేజిస్ట్రేట్ మిమ్మల్ని మొదటిసారిగా కలుసుకున్నప్పుడు ఈ మెమోలోని నిజానిజాలను మిమ్మల్ని అడిగి ధృవీకరించుకుంటారు. పోలీసులు 'ఇనస్పెక్షన్ మెమో'ను కూడా సిద్ధం చేయాల్సి ఉంటుంది.

**92. 'ఇనస్పెక్షన్ మెమో' అంటే ఏమిటి ?**

మిమ్మల్ని నిర్బంధంలోకి తీసుకున్నప్పటి మీ శారీరక పరిస్థితిని క్లుప్తంగా వివరించే పత్రం. మీ సాధారణ శారీరక పరిస్థితిని నమోదు చేయడంతోపాటూ, పెద్దవి, చిన్నవి గాయాలేవయినా ఉంటే వాటినికూడా పేర్కొనాలి. దీనిమీద మీరు, మిమ్మల్ని అరెస్ట్ చేసిన అధికారి సంతకం చేసి ఒకనకలు ప్రతిని మీకివ్వాలి. ఈ మెమోకు అరెస్ట్ మెమోకు తేడా ఏమిటంటే – దీనిని కేవలం మీ అభ్యర్థన మేరకే సిద్ధం చేస్తారు. మీరు అడగకపోతే అది సిద్ధం చేయాల్సిన అవసరం లేదు. ఇది ఎందుకు అంటే–నిర్బంధంలో మిమ్మల్ని కొట్టడం లేదా హింసించడం జరగలేదని నిర్ధారించుకోవడానికి.

అయితే ఎవరు మిమ్మల్ని పరీక్షించాలన్న దానిలో స్పష్టత లేదు. అరెస్ట్ చేసిన అధికారే మిమ్మల్ని పరీక్షించినప్పుడు ఆ చిన్న కాగితపు ముక్క మీకు కల్పించే రక్షణ ఏముంటుంది ? అయితే మేజిస్ట్రేట్ దగ్గర మిమ్మల్ని మొదటిసారి హాజరుపరిచే సమయంలో సమర్పించే పత్రాలతోపాటూ డాక్టర్ సర్టిఫికేట్ కూడా ఇవ్వాలి. అంటే మిమ్మల్ని అలా హాజరు పరిచేముందు ఒక డాక్టర్ మిమ్మల్ని, మీ శారీరక పరిస్థితిని తప్పనిసరిగా పరీక్షించి స్టేట్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది.

**93. ఇదంతా నాకు ఎలా తెలుస్తుంది ?**

చట్ట ప్రకారం, అరెస్ట్ చేసే సమయంలో పోలీసులు మీ హక్కుల సమాచారం మీకు తెలియ చేయాల్సి ఉంటుంది. అంతేకాక పైన చెప్పిన మార్గదర్శక సూత్రాలన్నీ పోలీస్ స్టేషన్‌లోని/చౌకీల్లోని/ఠాణాల్లోని పోలీస్ బోర్డ్‌లో ప్రదర్శించాలి. ఒక సుప్రీం కోర్టు కేసు తర్వాత రూపుదిద్దుకున్న ఈ సూత్రాలను కొన్ని సార్లు 'డికె బసు మార్గదర్శకాలని' కూడా అంటూంటారు.

**94. నిర్బంధంలో ఉన్నప్పుడు ఒక పోలీస్ అధికారి నన్ను కొట్టవచ్చా ?**

లేదు. నిర్బంధంలో ఉన్నప్పుడు అలా కొట్టడానికి కానీ, చెంపదెబ్బ కొట్టడానికి గానీ, హెచ్చరించడానికి గానీ, భయపెట్టడానికి గానీ లేదు. అది చట్ట వ్యతిరేకం. అలా చేసిన పోలీస్ అధికారి శిక్షార్హుడవుతాడు.

**95. నేరాన్ని అంగీకరించాల్సిందిగా ఒక పోలీస్ అధికారి నన్ను బలవంత పెట్టవచ్చా ?**

అలా కుదరదు. పోలీస్ అధికారికి ప్రశ్నించే హక్కుంటుంది. కానీ మీ దగ్గర లేని సమాచారాన్ని చెప్పాలనిగానీ, మీరు చేయని ఒక నేరాన్ని చేసినట్టుగా అంగీకరించాలని గానీ మిమ్మల్ని బలవంత పెట్టలేడు. ఏదిఏమయినా పోలీస్ అధికారి ముందు మీరు చేసిన నేరాంగీకారం కోర్టులో చెల్లదు.



**96. ఇన్ని ఆంక్షలు, నియమ నిబంధనల మధ్య పోలీసులు దోషులను అరెస్ట్ చేయాల్సిన తమ విధులను సమర్థంగా నిర్వర్తించగలరా ?**

ఇక్కడ ఒక విషయాన్ని అర్థం చేసుకోవాలి. దోషులెవరు ? ఎవరుకాదు ? అని నిర్ధారించవలసిన పని పోలీసులది కాదని ముందుగా మీరు గుర్తించాలి. అనుమానితులను, నిందితులను తమ అదుపులోకి తీసుకోవడం వరకే పోలీసుల పని. సదరు వ్యక్తి ఇప్పటికే దోషి అని, అతనిని లేదా ఆమెను శిక్షించే హక్కు తమకు ఉందన్నట్లు పోలీసులు ప్రవర్తించకూడదు. అది న్యాయస్థానాల పని. ఇదిలావుంటే నిర్బంధంలో ఉన్న వారికి తప్పుడు ఆరోపణలనుండి, సరిగా చూసుకోని పరిస్థితులనుండి అవసరమైన ప్రతి రక్షణ పోలీసులు విధిగా కల్పించాలి. అందుకే ' ఈ ఆంక్షలు, నిబంధనలు, నియమాలు'. నిజానికి అవి ఆంక్షలు, నిబంధనలు కావు. ప్రతి ఒక్కరికి న్యాయస్థానాల ముందు తమ వాదనను ధైర్యంగా చెప్పుకోవడానికి వీలుగా ఒక పద్ధతిలో రూపొందించిన విధి విధానాలు.

**97. నిందితులకు చాలా హక్కులున్నట్లు అనిపించడం లేదా? మరి బాధితుల మాటేమిటి ?**

చాలా మంది ఇలానే అనుకుంటుంటారు, బాధితుల గురించి ఎవరూ ఆలోచించడం లేదని. నిజానికి ప్రభుత్వం మొత్తం బాధితుడికి అండగానే ఉంది. వాళ్ళకోసమే కదా, నేరస్థులకోసం అంతగా వేటాడేది. వాళ్ళ తరఫున కోర్టులో వాదించడానికే కదా ప్రాసిక్యూటర్లను నియమించేది. బాధితుడి తరఫున నిలబడే గదా నేరస్థులను ప్రభుత్వ ం శిక్షించేది. కానీ నిందితుడు మాత్రం ఒంటరే ! అతను అసలు దోషి కాకపోవచ్చు. అందుకే ఆ ఒక్క వ్యక్తి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి ప్రభుత్వం తన అధికారాల వినియోగంలో సమతూకం పాటించడానికి వీలుగా చట్టం ఉచిత న్యాయ సహాయంవంటి సౌకర్యాలు, భద్రతలు కల్పించింది.

**98. పోలీసులనుండి నేను బెయిల్ పొందవచ్చా ?**

చెప్పలేం. అది చేసిన నేరంమీద ఆధారపడి ఉంటుంది. బెయిల్‌కు అర్హత ఉన్న నేరారోపణపై మిమ్మల్ని అరెస్ట్ చేసి ఉంటే పోలీసులనుండి మీకు బెయిలు దొరుకుతుంది. బెయిల్ కు అర్హతలేని నేరాల విషయంలో....కొన్నింటిలో మాత్రం స్టేషన్ ఇన్‌చార్జ్  అధికారి మిమ్మల్ని బెయిల్‌పై విడుదల చేయవచ్చు.

**99. ఏ నేరం బెయిల్ పొందతగినది, ఏది కాదు అనేది తెలుసుకోవడం అంత అవసరమా ?**

అవసరమే. బెయిల్ పొందతగిన నేరాలంటే అవి అంత తీవ్రమైనవి కావని అర్థం. అలాంటి సందర్భాల్లో అది ఒక హక్కు కింద లెక్క. ఆ కేసుల్లో  పోలీసులనుంచి వెంటనే బెయిల్ దొరుకుతుంది. బెయిల్‌కు అర్హతలేని తీవ్రమైన నేరాల్లో బెయిల్ అనేది ప్రత్యేకతలతో కూడిన హక్కు. వీటిలో ఎక్కువ భాగానికి కోర్టులు మాత్రమే బెయిల్ ఇవ్వగలవు. కొన్ని మినహాయింపులున్నచోట పోలీసులు కూడా బెయిల్ ఇవ్వవచ్చు.

**100. బెయిల్‌కు అర్హత పొందని నేరారోపణ నాపై చేసి ఉంటే నాకు బెయిల్ దొరకడం అసాధ్యమా ?**

అలా అనికూడా భావించనవసరం లేదు. నాన్‌బెయిల్‌బుల్ కేసుల్లో కూడా మీకు బెయిల్ దొరుకుతుంది. ఆమేరకు న్యాయస్థానానికి మీరు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కోర్టు నేర తీవ్రతను బట్టి చూస్తుంది. బెయిల్ ఇస్తే మీరేమయినా పారిపోయే అవకాశం ఉందా ? సాక్షుల నేమయినా బెదిరించే అవకాశం ఉందా ? లేక సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉందా ? ...ఇవన్నీ కోర్టు పరిశీలిస్తుంది. వీటికి అవకాశం లేదని భావిస్తే కోర్టు మీకు బెయిల్ మంజూరు చేయవచ్చు.

**101. అంటే దానర్థం నాకు విముక్తి లభించినట్లేనా ?**

విముక్తి కాదు, విడుదల. అంతవరకే. మీరింకా విచారణను ఎదుర్కోవలసి ఉంటుంది. ఆ విచారణలో తెలుతుంది–మీరు నేరస్థులా లేక నిర్దోషులా అని.



# పోలీస్ అధికార చిహ్నాలు



డైరెక్టర్
జనరల్ ఆఫ్
పోలీస్



ఇనస్పెక్టర్
జనరల్ ఆఫ్
పోలీస్



డిప్యూటీ
ఇనస్పెక్టర్
జనరల్ ఆఫ్
పోలీస్



సీనియర్
సూపరింటెండెంట్
ఆఫ్ పోలీస్




సూపరింటెండెంట్
ఆఫ్ పోలీస్



అడిషనల్
సూపరింటెండెంట్
ఆఫ్ పోలీస్


# పోలీస్ అధికార చిహ్నాలు



అసిస్టెంట్ / డిప్యూటీ
సూపరింటెండెంట్
ఆఫ్ పోలీస్



ఇనస్పెక్టర్



సబ్ ఇనస్పెక్టర్



అసిస్టెంట్
సబ్ ఇనస్పెక్టర్



హెడ్ కానిస్టేబుల్

# CHRI – కార్యక్రమాలు

ప్రజల నిత్యజీవితంలో మానవ హక్కులు, అసలు సిసలు ప్రజాస్వామ్యం, అభివృద్ధి అనేవి వాస్తవంగా కనిపించాలి. ఇది జరగాలంటే కామన్వెల్తులో ఆంతరంగికంగానూ, దాని సభ్య దేశాల్లోనూ బాధ్యత భాగస్వామ్యాలలో అత్యుత్తమ ప్రమాణాలుండాలి, వాటి అమలు యంత్రాంగం పటిష్ఠంగా ఉండాలన్న భావసల ఆధారంగా CHRI పనిచేస్తుంది. దీనికి అనుగుణంగా మాసవ హక్కులకు సంబంధించిన విశాల కార్యాచరణకు అదనంగా సమాచారం, న్యాయం పౌరులకు అందుబాటులో ఉండాలన్నది CHRI వాదన. పరిశోధన, ప్రచురణలు, చర్చాగోష్ఠులు, సమాచారం పంపిణీ, అనుకూల వాదనల ద్వారా దీనికి సంబంధించిన ఫలితాలను CHRI సాధిస్తున్నది.

## మానవ హక్కుల సమర్థన:

కామన్వెల్తుకు సంబంధించిన అధికార సంస్థలకు, సభ్యదేశాలకు CHRI ఎప్పటికప్పుడు నివేదికలు అందచేస్తుంటుంది. అలాగే అవసరమయినప్పుడల్లా 'నిజనిర్ధారణ' నిర్వహిస్తుంటుంది. 1995 నుంచి ఇప్పటివరకు నైజీరియా, జాంబియా, ఫిజీదీవులు, సియారా లియోన్‌లకు నిజ నిర్ధారణ సంఘాలను పంపింది. మానవ హక్కుల సాధనలో ఉమ్మడి శక్తిని పెంపొందించడానికి కామన్వెల్తుకు సంబంధించిన పలు మానవ హక్కుల సంఘాల కార్యక్రమాలతో CHRI సమన్వయం చేసుకుంటున్నది. CHRI కి సంబంధించిన మీడియా విభాగం కూడా మానవ హక్కులపట్ల ప్రజలను చైతన్యవంతులను చేస్తుంటుంది.

## అందుబాటులో సమాచారం:

కార్యాచరణలో పౌరసమాజానికీ, ప్రభుత్వానికీ మధ్య గట్టి చట్టాలను రూపొందించడానికి సాంకేతిక నైపుణ్యాన్ని సమకూర్చడంలో CHRI అనుసంధానకర్తగా వ్యవహరించడమేగాక, మంచి కార్యక్రమాల అమలులో భాగస్వామ్య పక్షాలకుసహాయకారిగా ఉంటున్నది. స్థానిక బృందాలతో, అధికారులతో CHRI కలిసి పనిచేయడమేకాక, ప్రభుత్వం, పౌరసమాజం, విధాన నిర్ణేతల సామర్థ్యాన్ని పెంచడానికి కూడా కృషి చేస్తున్నది. దక్షిణాసియాలో CHRI చురుగ్గా పనిచేస్తున్నది. ఇటీవల భారత్‌లో ఒక జాతీయ చట్టరూపకల్పనకు సంబంధించిన ప్రచారాన్ని విజయవంతంగా నిర్వహించడంలో తోడ్పడింది. ఆఫ్రికాలో ముసాయిదా చట్టాలరూపకల్పన, దానికి అవసరమయిన సమాచారాన్ని సమకూర్చింది. పసిఫిక్‌లో కూడా చట్టాలను సులభంగా ఉపయోగించుకోవడానికి అవసరమయిన ఆసక్తి కలిగించడంలో ప్రాంతీయ, జాతీయ సంఘాలతో కలిసి పనిచేసింది.

## న్యాయం అందుబాటులో:

పోలీస్ సంస్కరణలు: చాలాదేశాల్లో పోలీసులంటే – పౌరుల హక్కులను కాపాడేవారిగా కాక, ప్రభుత్వం తరఫున అణగదొక్కే యంత్రాంగంగా చూడడం పరిపాటయింది. దీనితో హక్కుల ఉల్లంఘనలు విరివిగా జరిగాయి. న్యాయం తిరస్కరించబడింది. అధికారంలో ఉన్న ప్రభుత్వం చేతిలో సాధనంలాగా కాకుండా, పోలీసులు చట్టాన్ని రక్షించేవారిగా ఉండడానికి వీలు కల్గించే సంస్కరణలను CHRI సమర్థిస్తుంది. ప్రోత్సహిస్తుంది. భారతదేశంలో పోలీస్ సంస్కరణలకు ప్రజల మద్దతు కూడగట్టేవిధంగా CHRI కార్యక్రమాలను ఉద్దేశించడం జరిగింది. తూర్పు ఆఫ్రికా, దక్షిణాసియా, ఘనాలలో రాజకీయ జోక్యం, పోలీసులను బాధ్యులుగా చేసే అంశాలవంటి విషయాలను CHRI అధ్యయనం చేస్తున్నది.

జైలు సంస్కరణలు: సాంప్రదాయకంగా జైళ్ళవ్యవస్థ రహస్యంగా ఉంటున్నది. దీనిలో పారదర్శకతను పెంపొందించే, అక్రమాలను తొలగించే కార్యక్రమాలపై CHRI శ్రద్ధచూపుతుంది. న్యాయ వ్యవస్థలోని కొన్ని లోపాల కారణంగా జైళ్లు భయంకరంగా క్రిక్కిరిసిపోతున్నాయి. అలాగే విచారణకు ముందే అక్రమంగా సుదీర్ఘ కాలంపాటూ నిర్బంధంలో ఉంచడం, శిక్షాకాలం దాటిపోయినా వారిని విడుదల చేయకపోవడం వంటి న్యాయ వ్యవస్థ వైఫల్యాలపై ఎక్కువగా జోక్యం చేసుకోవడంపై CHRI ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తుంది. తద్వారా పరిస్థితి మెరుగుపడడానికి దోహదం చేస్తుంది. జైళ్ల వ్యవస్థలో పూర్తిగా విఫలమయిన నిఘా యంత్రాంగం పునరుద్ధరణపై కూడా CHRI కృషి చేస్తుంది. దీనివల్ల జైళ్ళపాలక నిర్వహణలో సానుకూల మార్పులు రావడమేగాక, న్యాయపాలనపై కూడా దాని ప్రభావం పడుతుంది.

విషయపరిజ్ఞానానికి

# పెద్దలకోసం ఓ పిల్లల పుస్తకం

Friedrich Naumann STIFTUNG FÜR DIE FREIHEIT

USO House, 6, Special Institutional Area, New Delhi 110067, INDIA
Phone: +91-11-2686 2064/ 2686 3846 Fax: +91-11-2686 2042
www.southasia.fnst.org www.stiftung-freiheit.org

**Delegation of the European Union to India**
5/5, Shantiniketan, New Delhi – 110021
Phone: +91-11-66781919
Fax: +91-11-66781955
Website: http://www.eeas.europa.eu/delegations/india/index_en.htm

ఈ పుస్తకం ఐరోపా సంఘం (యూరోపియన్ యూనియన్) ఆర్థిక సహాయంతో వెలువడింది. ఈ సంఘంలో 28 దేశాలకు సభ్యత్వం ఉంది. వాటి పరిజ్ఞానాన్ని, వనరులను, భాగ్యాభాగ్యాలను క్రమేణా అనుసంధానించుకోవాలని ఇవి నిర్ణయించుకున్నాయి. సాంస్కృతిక వైవిధ్యాలను, సహనాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛలను పరిరక్షించుకుంటూ ఈ 50 ఏళ్ళకాలంలో ఇవి కలిసికట్టుగా స్థిరత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సుస్థిరవృద్ధిని సాధించిపెట్టగల ఒక వ్యవస్థను రూపొందించుకున్నాయి. ఈ సంఘం తమ విజయాలను, విలువలను తమ సరిహద్దుల ఆవలి దేశాలతో, ప్రజలతో కూడా పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఈ నివేదికలోని అంశాలకు బాధ్యత పూర్తిగా CHRI ది. ఎటువంటి పరిస్థితులలో కూడా ఐరోపా సంఘం (యూరోపియన్ యూనియన్) అభిప్రాయాలను CHRI ప్రతిబింబించినట్టుగా భావించకూడదు.

**COMMONWEALTH HUMAN RIGHTS INITIATIVE**
55A, Third Floor, Siddharth Chambers, Kalu Sarai, New Delhi 110 016, INDIA
Tel: +91-11-4318-0200, 4318-0201
Fax: +91-11-4618-0217
info@humanrightsinitiative.org; www.humanrightsinitiative.org